మెయిన్
# టీ-మీడియా
సామాజికం.. ప్రజల పక్షం...
సంపుటి : 8
సంచిక : 261
పేజీలు : 3
ఆదివారం -19 ఏప్రిల్, 2026
GSTIN:36FDKPS1308P1ZX | Digital, tmedia.net.in
ఎడిటర్ : శనగపాటి మురళీకృష్ణ

డిజిటల్ మీడియాలో అగ్రగామిగా ముందుకు సాగుతున్న
Digital, tmedia.net.in
సామాజికం... ప్రజల పక్షంగా...
కేంద్ర ప్రభుత్వ ఐటీ ఎథిక్స్ కోడ్‌కు అనుగుణంగా నడుస్తున్న
T MEDIA E-PAPER
ఈ పేపర్‌కు జిల్లా వారీగా ఫ్రాంచైజీలు ఇవ్వబడుతున్నాయి.
ఆసక్తి ఉన్నవారు సంప్రదించండి.
కాల్ చేయండి: 8919710365
Following IT Ethics Code of Government of India | www.tmedia.net.in | /tmediadigital

# హార్మూజ్‌పై ఇరాన్ యూటర్న్




## జలసంధిని మళ్లీ మూసేసిన ఇరాన్

- **ఒప్పందాన్ని అమెరికా ఉల్లంఘించినందుకే**

**టీ మీడియా, ఏప్రిల్ 18, ఢిల్లీ బ్యూరో:**

ఇరాన్ కీలక నిర్ణయం తీసుకుంది. హార్మూజ్ జలసంధిని మళ్లీ మూసివేసినట్లు శనివారం వెల్లడించింది. తమ నౌకలు స్వేచ్ఛగా రాకపోకలు సాగించేలా అమెరికా ఆంక్షలను ఎత్తివేసే వరకు, హార్మూజ్‌పై తమ కఠిన నియంత్రణ కొనసాగుతుందని స్పష్టం చేసింది. అణ్వస్త్ర కార్యక్రమం సహా అన్ని అంశాలపై తమతో తుది ఒప్పందాన్ని కుదుర్చుకునే దాకా ఇరాన్ ఓడరేవుల ముట్టడిని ఆపేది లేదని అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ స్పష్టం చేసిన నేపథ్యంలో ఇరాన్ ఈ నిర్ణయం తీసుకోంది.

లెబనాన్ - ఇజ్రాయెల్ కాల్పుల విరమణ ఒప్పందానికి అనుగుణంగా హార్మూజ్‌ను పూర్తిగా తెరిచినట్లు శుక్రవారమే ఇరాన్ ప్రకటించింది. అయినప్పటికీ తమ ఓడరేవుల ముట్టడిని అమెరికా కొనసాగిస్తున్నందుకు నిరసనగా, కొన్ని గంటల్లోనే ఇరాన్ నిర్ణయాన్ని మార్చుకుంది. హార్మూజ్ జలసంధి మార్గంలో మళ్లీ ఆంక్షలను అమల్లోకి తెచ్చామని ఇరాన్ జాయింట్ మిలిటరీ కమాండ్ (ఖతం అల్ అంబియా) శనివారం ప్రకటించింది. హార్మూజ్, దాని పరిసర ప్రాంతాలను మునుపటిలాగే తమ సైనిక దళాలు పకడ్బందీగా కంట్రోల్ చేస్తాయని తెలిపింది. తమ ఓడరేవులను ముట్టడించడం ద్వారా కాల్పుల విరమణ ఒప్పందాన్ని అమెరికా ఉల్లంఘించిందని ఇరాన్ జాయింట్ మిలిటరీ కమాండ్ ఆరోపించింది. ఈ ముట్టడిని అమెరికా కొనసాగించినన్ని నాళ్లు, హార్మూజ్ ముట్టడిని తాము కొనసాగిస్తామని తేల్చి చెప్పింది.

### 20న అమెరికా - ఇరాన్ మరోవిడత చర్చలు

అమెరికా - ఇరాన్ మధ్య మరోవిడత శాంతిచర్చలు సోమవారం రోజు (ఏప్రిల్ 20న) పాకిస్థాన్ రాజధాని ఇస్లామాబాద్ వేదికగా జరిగే అవకాశాలు ఉన్నాయి. ఇందుకోసం ఇరుదేశాల ప్రతినిధులు ఆదివారంకల్లా ఇస్లామాబాద్‌కు చేరుకుంటారని సమాచారం. చర్చలతో సంబంధమున్న పలువురు ఇరాన్ అధికార వర్గాలు ఈవివరాలను చెప్పాయంటూ అమెరికా మీడియాలో కథనాలు ప్రచురితమయ్యాయి. సరిగ్గా ఈ తరుణంలో హార్మూజ్ జలసంధిపై ఇరాన్ మళ్లీ ఆంక్షలను అమల్లోకి తేవడం గమనార్హం. అమెరికాపై ఒత్తిడిని పెంచడంతో పాటు తమ ఓడరేవుల ముట్టడిని అడ్డుకునేందుకే ఇరాన్ ఈ నిర్ణయం తీసుకొని ఉండొచ్చని పరిశీలకులు అంచనా వేస్తున్నారు.

### తుర్కియే - పాక్ - ఖతార్ పాలకుల భేటీ

హార్మూజ్ నియంత్రణ విషయంలో ఇరాన్, ఇరాన్ ఓడరేవుల ముట్టడిపై అమెరికా మొండివైఖరితో వ్యవహరిస్తుండటంతో పశ్చిమాసియాలో మళ్లీ సైనిక ఉద్రిక్తతలు పెరగొచ్చనే ఆందోళన వ్యక్తమవుతోంది. ఈ నేపథ్యంలో శుక్రవారం రోజు (ఏప్రిల్ 17న) తుర్కియేలోని అంటాల్య నగరంలో పాకిస్థాన్ ప్రధానమంత్రి షెహబాజ్ షరీఫ్‌తో ఖతార్ రాజు షేక్ తమీమ్ బిన్ హమద్ అల్ థానీ, తుర్కియే అధ్యక్షుడు రజబ్ తయ్యబ్ ఎర్డోగన్ భేటీ అయ్యారు. అమెరికా - ఇరాన్ సైనిక ఉద్రిక్తతలను తగ్గించడం, పశ్చిమాసియా దేశాల మధ్య దౌత్య సంబంధాల బలోపేతం వంటి అంశాలపై చర్చించారు.

### కాల్పుల విరమణ గడువును పొడిగించకపోవచ్చు : ట్రంప్

ఇరాన్‌తో కుదిరిన రెండువారాల (ఏప్రిల్ 8 - 22) కాల్పుల విరమణ ఒప్పందాన్ని తాను పొడిగించే అవకాశాలు ఉండకపోవచ్చని అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ స్పష్టం చేశారు. కాల్పుల విరమణ గడువు (ఏప్రిల్ 22) ముగిసేలోగా ఇరాన్ తమతో ఒప్పందాన్ని కుదుర్చుకుంటుందా లేదా అనే దానిపై ఈ నిర్ణయం ఆధారపడి ఉంటుందని ఆయన తెలిపారు. ఒకవేళ మళ్లీ తమతో కాల్పుల విరమణ డీల్‌ను ఇరాన్ కుదుర్చుకోకుంటే, ఆ దేశ ఓడరేవుల ముట్టడిని అమెరికా నౌకాదళం కొనసాగిస్తుందన్నారు. దురదృష్టవశాత్తు మళ్లీ తాము ఇరాన్‌పై బాంబులు వేయాల్సి ఉంటుందని ట్రంప్ హెచ్చరించారు. తన ఎయిర్ ఫోర్స్ వన్ విమానంలో విలేకరులతో మాట్లాడుతూ అమెరికా ప్రెసిడెంట్ ఈ వ్యాఖ్యలు చేశారు. మళ్లీ ఇరాన్, అమెరికా - ఇజ్రాయెల్ మధ్య సైనిక ఘర్షణ జరగబోతోందనే సంకేతాలను ఇచ్చేలా ట్రంప్ కామెంట్స్ ఉన్నాయని పరిశీలకులు అంటున్నారు. ఫిబ్రవరి 28న మొదలైన ఇరాన్, అమెరికా - ఇజ్రాయెల్ యుద్ధం ఏప్రిల్ 7 వరకు కొనసాగింది. ఈ వ్యవధిలో పలు అమెరికా యుద్ధ విమానాలు, హెలికాప్టర్లు, డ్రోన్లనూ ఇరాన్ కూల్చేసింది. ఇక ఇదే సమయంలో అమెరికా - ఇజ్రాయెల్ దాడుల్లో ఇరాన్‌లో భారీ ఆస్తి, ప్రాణ నష్టం జరిగాయి.



## 26 వరకు వర్షాలు కురిసే అవకాశం

- **గంటకు 30 నుంచి 40 కి.మీ వేగంతో ఈదురుగాలులు**

**టీ మీడియా, ఏప్రిల్ 18, , హైదరాబాద్ బ్యూరో :**



తెలంగాణ రాష్ట్రంలో ఈనెల 26 వరకు వర్షాలు కురిసే అవకాశం ఉందని వాతావరణశాఖ ప్రకటించింది. ఉపరితల ఆవర్తనం, క్యూములోనింబస్ మేఘాలతో వర్షాలు కురిసే అవకాశం ఉందని, ఉరుములు, మెరుపులతో కూడిన వర్షం కురిసే అవకాశం ఉందని తెలిపింది. గంటకు 30 నుంచి 40 కి.మీ వేగంతో ఈదురుగాలులు వీస్తాయని తెలిపింది. గరిష్ఠ ఉష్ణోగ్రతల్లో స్వల్ప మార్పు ఉండే అవకాశం : ఇవాళ భూపాలపల్లి, ములుగు, భద్రాద్రి, వికారాబాద్, సంగారెడ్డి, మెదక్, కామారెడ్డి జిల్లాలకు వర్ష సూచన ఉన్నట్లు వాతావరణశాఖ వెల్లడించింది. రేపు ఆదిలాబాద్, ఆసిఫాబాద్, మంచిర్యాల, భూపాలపల్లి, ములుగు, భద్రాద్రి, వికారాబాద్, సంగారెడ్డి, మెదక్, కామారెడ్డి జిల్లాల్లో వర్షాలు కురిసే అవకాశం ఉంది. ఎల్లుండి ఆదిలాబాద్, ఆసిఫాబాద్, మంచిర్యాల, కరీంనగర్, పెద్దపల్లి, భూపాలపల్లి, ములుగు, వికారాబాద్, సంగారెడ్డి, మెదక్, కామారెడ్డి జిల్లాలకు వర్ష సూచన ఉందిని ప్రకటించింది. వర్షం కురిసే జిల్లాలకు ఎల్లో హెచ్చరికలు జారీ చేసిన వాతావరణశాఖ వర్షాలతో గరిష్ఠ ఉష్ణోగ్రతల్లో స్వల్ప మార్పు ఉండే అవకాశం ఉందని తెలిపింది. పంటను కాపాడుకోలేక రైతులు సతమతం : నిజామాబాద్ జిల్లాలో సాయంత్రం కురిసిన ఈదురు గాలులతో కూడిన వడగళ్ల వాన నానా బీభత్సం

మిగతా 3లో..

## 2023 మహిళా బిల్లును పార్లమెంట్‌లో పెట్టాలి

- **సీఎం రేవంత్ రెడ్డి డిమాండ్**
- **మహిళా బిల్లు పేరుతో డీలిమిటేషన్ బిల్లు**

**టీ మీడియా, ఏప్రిల్ 18, , ఢిల్లీ బ్యూరో :**

మహిళా బిల్లు పేరుతో డీలిమిటేషన్ బిల్లు తీసుకువచ్చిందని తెలంగాణ సీఎం రేవంత్ రెడ్డి ఆగ్రహం వ్యక్తం చేశారు. ఢిల్లీలో ముఖ్యమంత్రి మీడియా సమావేశంలో మాట్లాడారు. మహిళా బిల్లు వీగిపోవడం బీజేపీ విధానాల ఓటమిగా భావించాలని, మహిళా బిల్లు వీగిపోవడంతో ప్రతిపక్షాలపై అసత్యప్రచారం చేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు.

**రాజకీయం చేయాల్సిన అవసరం లేదు**

మహిళలకు కాంగ్రెస్ పార్టీ చాలా చేసిందని, మహిళా బిల్లుపై ప్రధాని మోదీకి నిజాయితీ లేదని సీఎం తెలిపారు. నిజాయితీగా మహిళా రిజర్వేషన్ల బిల్లు తీసుకువస్తే పార్లమెంట్‌లో అందరూ మద్దతు తెలిపేవారని అన్నారు. మహిళా బిల్లు పేరుతో డీలిమిటేషన్ బిల్లు తీసుకువచ్చి దక్షిణాదికి అన్యాయం చేసేవారని తెలిపారు. ప్రధాని మోదీ ఉత్తర, దక్షిణ భారతదేశం మధ్య అంతరాలు పెట్టే విధానాన్ని విరమించుకోవాలని హితువు



పలికారు. మహిళా రిజర్వేషన్ల బిల్లుపై తమకు చిత్తశుద్ధి ఉందని, కేంద్రానికి ఆర్థిక వనరులు దక్షిణాది నుంచి అందుతున్నాయని పేర్కొన్నారు. యూపీ ఎన్నికలలోపు మహిళా రిజర్వేషన్ల బిల్లు అమలు చేయాలని, 2023 మహిళా రిజర్వేషన్ల బిల్లును యథావిధిగా అమలు చేయాలని, మహిళా రిజర్వేషన్లలోనూ ఎస్సీ, ఎస్టీ, ఓబీసీ రిజర్వేషన్లు అమలు చేయాలని డిమాండ్ చేశారు. మహిళా రిజర్వేషన్ల బిల్లు విషయంలో రాజకీయం చేయాల్సిన అవసరం లేదన్నారు.

**గల్లీ నుంచి పార్లమెంట్ వరకు నిరసన తెలుపుతాం**

నిన్న లోక్‌సభలో బిల్లు వీగిపోవడంతో ప్రధాని మోదీ అహంకారం తగ్గిందన్న సీఎం తప్పుడు చట్టాలు తీసుకొస్తే గల్లీ నుంచి పార్లమెంట్ వరకు నిరసన తెలుపుతామని వెల్లడించారు. 2023 మహిళా బిల్లును సోమవారం పార్లమెంట్‌లో పెట్టాలని డిమాండ్ చేశారు. 2023 మహిళా బిల్లును పెడితే మద్దతు ఇచ్చేందుకు తాము సిద్ధంగా ఉన్నామని తెలిపారు.

**మరో బిల్లు తీసుకొస్తే అడ్డుకుంటాం**

మహిళా బిల్లు ముసుగులో డీలిమిటేషన్ బిల్లు తీసుకువచ్చారని రేవంత్ రెడ్డి తెలిపారు. కాంగ్రెస్ పార్టీ మహిళలకు అత్యంత ప్రాధాన్యత ఇచ్చిందని కొనియాడారు. మహిళా రిజర్వేషన్ల బిల్లును కాంగ్రెస్ పార్టీ వ్యతిరేకించట్లేదని స్పష్టం చేశారు. ప్రధాని నరేంద్ర మోదీ రాజకీయ పంతాలు, పట్టింపులకు పోవాల్సిన పనిలేదని హితువు పలికారు. మహిళా రిజర్వేషన్లకు సంబంధించి ఎలాంటి సవరణ తీసుకువచ్చినా మద్దతు ఇస్తామని స్పష్టం చేశారు. మహిళా రిజర్వేషన్ల బిల్లు ముసుగులో మరో బిల్లు తీసుకువస్తే గుర్తించి అడ్డుకుంటామని హెచ్చరించారు.

## 16 కోట్ల ఇంజెక్షన్‌తో పునర్వికకు పునర్జన్మ

- **రూ.6 కోట్లు అందజేసి ఆదుకున్న మంత్రి లోకేష్**

**టీ మీడియా, ఏప్రిల్ 18, , హైదరాబాద్ బ్యూరో**



అరుదైన స్పైనల్ మస్క్యులర్ అట్రోఫీతో బాధపడుతున్న పునర్విక ప్రాణాలను కాపాడటంలో మంత్రి నారా లోకేష్ కీలక పాత్ర పోషించారు. అమెరికా నుంచి రూ.16 కోట్ల విలువైన "జోల్ జెన్ స్మా" జీన్ థెరపీ ఇంజెక్షన్‌ను హైదరాబాద్‌కు రప్పించేందుకు ఆయన చేసిన సమన్వయం ఫలించింది. జూబ్లీహిల్స్‌లోని రెయిన్ బో చిన్నపిల్లల ఆసుపత్రిలో ఈ ఉదయం వైద్యులు పునర్వికకు ఇంజెక్షన్ అందించారు. ఆ సమయంలో లోకేష్ స్వయంగా అక్కడే ఉండి చికిత్సను పర్యవేక్షించారు. అనంతరం కుటుంబ సభ్యులను పరామర్శించి, వైద్యులతో మాట్లాడి చిన్నారి ఆరోగ్య పరిస్థితిపై వివరాలు తెలుసుకున్నారు. చిన్నారి ఏడుస్తుండగా ఎత్తుకుని ఆదరించారు. "చిన్నారిని కాపాడటం నా బాధ్యత" అంటూ తల్లిదండ్రులకు భరోసా ఇచ్చారు. కర్నూలు జిల్లా వెల్దుర్తికి చెందిన ఏడాది వయసున్న పునర్విక, వెన్నెముక కండరాల క్షీణత అనే ప్రాణాంతక వ్యాధితో బాధపడుతోంది. పుట్టిన కొద్ది నెలలకే శరీర కదలికలు లేకపోవడంతో తల్లిదండ్రులు ఆందోళన చెందారు. మొదట కర్నూలులో చికిత్స చేయించగా, వైద్యుల సూచన మేరకు హైదరాబాద్‌కు తరలించారు. అక్కడ వైద్యులు నాహీూ టైప్-1గా నిర్ధారించి, ప్రాణాలను కాపాడాలంటే ఒక్కటే మార్గమని రూ.16 కోట్ల ఖరీదైన జీన్ థెరపీ ఇంజెక్షన్ అవసరమని తెలిపారు. ఆర్థికంగా బలహీన పరిస్థితుల్లో ఉన్న తల్లిదండ్రులు ఈ ఏడాది ప్రారంభం నుంచి సహాయం కోసం విజ్ఞప్తి చేశారు. సోషల్ మీడియాలో విషయం వైరల్ కావడంతో దేశం నలుమూలల నుంచి స్పందన వెల్లువెత్తింది. విరాళాల రూపంలో సుమారు రూ.10 కోట్ల వరకు సమకూరాయి. ఇంకా అవసరమైన మొత్తానికి దారి లేక ఆందోళనలో ఉన్న సమయంలో మంత్రి నారా లోకేష్‌ను ఆశ్రయించారు. పరిస్థితిని వెంటనే అర్థం చేసుకున్న ఆయన, "పునర్విక బాధ్యత నాదే" అని హామీ ఇచ్చారు. ఆ మాటకే కట్టుబడి మిగతా సహాయం సమీకరించి చికిత్స జరిగేలా చేశారు. ఇంజెక్షన్‌ను అమెరికా నుంచి త్వరగా రప్పించేందుకు మంత్రి లోకేష్ తన సిబ్బందితో కలిసి నిరంతరం పర్యవేక్షించారు. ఔషధ సంస్థలు, ఆసుపత్రి యాజమాన్యం, వైద్యులతో సమన్వయం చేస్తూ అన్ని ప్రక్రియలు వేగవంతం చేశారు. వైద్య పత్రాలు, అనుమతులు, చెల్లింపులు, రవాణా వంటి అంశాల్లో ఎక్కడా ఆలస్యం జరగకుండా చూసుకున్నారు. ఈ సమగ్ర ప్రయత్నంతోనే కీలకమైన సమయానికి చికిత్స సాధ్యమైంది.

### తాము పునర్వికకు జన్మనిచ్చినా ఇప్పుడు..

దేశ ప్రజల చొరవతో ఆమెకు పునర్జన్మ లభించిందని తల్లిదండ్రులు భావోద్వేగంతో చెప్పారు. మంత్రి నారా లోకేష్‌తో పాటు వైద్యులు, సహాయం చేసిన ప్రతి ఒక్కరికీ పేరుపేరునా కృతజ్ఞతలు తెలిపారు. తమ చిన్నారి ప్రాణాలు కాపాడటంలో అందరి పాత్రను జీవితాంతం గుర్తుంచుకుంటామని అన్నారు. ప్రస్తుతం పునర్విక ముఖంలో కనిపించిన ఆ చిరునవ్వు మానవత్వం గెలిచిన మరో ఉదాహరణగా నిలిచింది.

## తెలంగాణలో మరోసారి ఎన్నికల నగారా

- **వచ్చే నెలలో జడ్పీటీసీ, ఎంపీటీసీ ఎలక్షన్స్**

**టీ మీడియా, ఏప్రిల్ 18, , హైదరాబాద్ బ్యూరో :**




తెలంగాణ రాష్ట్రంలో జడ్పీటీసీ, ఎంపీటీసీ ఎన్నికలకు సంబంధించి రంగం సిద్ధమైంది. ఈ నేపథ్యంలోనే ఓటర్ల జాబితాను సిద్ధం చేయాలని ఎస్?ఈసీ (రాష్ట్ర ఎన్నికల సంఘం) ఉత్తర్వులు జారీ చేసింది. అన్నీ అనుకూలించినట్లయితే మే నెలలోనే ఎన్నికలు జరిగే అవకాశాలున్నాయి. 10.07.2025 నుంచి 05.02.2026 వరకు కేంద్ర ఎన్నికల సంఘం నవీకరించిన జాబితాలో నియోజకవర్గాల్లోని అదనపు ఓటర్ల వివరాలను మండలాల వారీగా గుర్తించి, వాటిని సంబంధిత పంచాయతీ, పోలింగ్ కేంద్రాల వారీగా ఉన్న జాబితాలకు జత చేయాలని హైదరాబాద్, మేడ్చల్-మల్కాజిగిరి మినహా అన్ని జిల్లాల కలెక్టర్లను ఎస్?ఈసీ ఆదేశాలు జారీ చేసింది. వీటి ఆధారంగా ఎంపీటీసీ, జడ్పీటీసీల పరిధిలోని గ్రామ పంచాయతీలు, పోలింగ్ స్టేషన్ల వారీగా కొత్త జాబితాలను రూపొందించాలని తాజాగా ఉత్తర్వులను జారీ చేసింది. ఈ జాబితాలను జిల్లా పంచాయతీ అధికారి (డీపీవో) ధ్రువీకరణ అనంతరం, సెంటర్ ఫర్ గుడ్ గవర్నెన్స్ (సీజీజీ) యూజర్ మాన్యువల్ సూచనల ప్రకారం పోలింగ్ సెంటర్లకు అనుసంధానించాలని పేర్కొంది. ఆ డేటాలో ఏవైనా తేడాలున్నట్లు గమనిస్తే, వాటిని ఈ నెల 23వ తేదీలోపు ఎన్నికల సంఘానికి నివేదించాలని ఎస్?ఈసీ సూచించింది. వాటిని ఆమోదించిన తర్వాత ముసాయిదా జాబితాలను గ్రామాల వారీగా విడుదల చేయనున్నారు. అభ్యంతరాలు, సలహాలు, సూచనలు పరిగణనలోకి తీసుకొని తుది జాబితాను విడుదల చేస్తారు. ఆ తర్వాత పోలింగ్ సెంటర్లు, బ్యాలెట్ బాక్స్‌లు, ఇతర ఏర్పాట్లను చేయనున్నారు.

**సెప్టెంబరులోనే ప్రక్రియ చేపట్టినప్పటికీ**

ఎంపీటీసీ, జడ్పీటీసీలకు చివరిసారిగా 2019 మే 6, 10, 14వ తేదీల్లో ఎన్నికలు జరగ్గా, వెంటనే రిజల్ట్? ప్రకటించారు. జూన్‌లో ఎంపీపీ, జిల్లా పరిషత్? ఛైర్‌పర్సన్లను ఎన్నుకున్నారు. గత ఏడాది జూన్ నెలతో వారి పదవీ కాలం ముగిసింది. అప్పటి నుంచి స్పెషల్ ఆఫీసర్ల పాలన నడుస్తోంది. వాస్తవానికి రెండు దశల్లో జడ్పీటీసీ, ఎంపీటీసీ ఎన్నికల నిర్వహణకు గత సెప్టెంబరు 29న నోటిఫికేషన్ విడుదల చేయగా, నామినేషన్ల స్వీకరణ మొదలైంది. బీసీ రిజర్వేషన్లకు సంబంధించిన పిటిషన్‌పై విచారణ సందర్భంగా అక్టోబరు 9వ తేదీన హైకోర్టు ఆదేశాల మేరకు ఈ ప్రక్రియ నిలిచిపోయింది. ఆ తర్వాత రాష్ట్ర ఉన్నత న్యాయస్థానం అనుమతితో గ్రామ పంచాయతీలు, పురపాలక సంఘాలకు ఎన్నికలను నిర్వహించారు. రిజర్వేషన్ల విధానాన్ని ప్రకటించిన అనంతరం దానికి అనుగుణంగా ఎంపీటీసీ, జడ్పీటీసీ ఎన్నికలకు సైతం హైకోర్టు అనుమతితో మే నెలలో నిర్వహించాలనే యోచనలో ప్రభుత్వం ఉన్నట్లుగా సమాచారం.

**5,773 ఎంపీటీసీలు, 566 జడ్పీటీసీలు**

తాజాగా మళ్లీ వచ్చే ఎన్నికలకు సంబంధించి ఇప్పటికే రాష్ట్ర పంచాయతీరాజ్ శాఖ జడ్పీటీసీ, ఎంపీటీసీ స్థానాల జాబితాను రూపొందించి ఎస్?ఈసీ (రాష్ట్ర ఎన్నికల సంఘానికి) నివేదించింది. ఈ మేరకు మొత్తం 566 జడ్పీటీసీ స్థానాలు, ఆ మేరకు మండల ప్రజాపరిషత్ ఛైర్‌పర్సన్లు (ఎంపీపీలు), 5,773 ఎంపీటీసీ స్థానాలను ఖరారు చేసింది. మేడ్చల్-మల్కాజిగిరిని అర్బన్ జిల్లాగా మార్చడం వల్ల జిల్లా పరిషత్‌ల జాబితా నుంచి దానిని తొలగించారు. దీంతో ప్రస్తుతం మొత్తం 31 జిల్లా పరిషత్‌లున్నాయి. 2019 తర్వాత మున్సిపాలిటీలు, నగరపాలికల్లో చాలా గ్రామ పంచాయతీలు విలీనమయ్యాయి. ఫలితంగా గ్రామాల సంఖ్య తగ్గుదల కారణంగా 44 ఎంపీటీసీలు, నాలుగు జడ్పీటీసీ, నాలుగు ఎంపీపీ స్థానాలు తగ్గాయి. ఎన్నికలు జరగనున్నాయనే సంకేతాలు వస్తున్న వేళ అశావహుల్లో ఉత్సాహం నెలకొంది. ఈసారి ఎలాగైనా సీటు దక్కించుకుని గెలుపే లక్ష్యంగా ముందుకు సాగేందుకు సిద్ధమవుతున్నారు. ఇప్పటికే సర్పంచ్, నగరపాలక ఎన్నికలు పూర్తయిన వేళ జడ్పీటీసీ, ఎంపీటీసీ ఎన్నికలకు రెడీ అవుతున్నారు.

# రోజువారీ కూలీల్లో ఎస్సీలే అధికం

- 13 శాతం మందికి నో టాయిలెట్స్

**టీ మీడియా, ఏప్రిల్ 18, , హైదరాబాద్ బ్యూరో :**

రాష్ట్రంలోని ఎస్సీల్లో రోజువారీ కూలీలే అత్యధిక సంఖ్యలో ఉన్నారని సమగ్ర కుటుంబ సర్వే నివేదిక వెల్లడించింది. షెడ్యూల్డ్? కులాల వారిలో 25 శాతం మంది దినసరి కూలీలుగా, 29 శాతం మంది ఉపాధి హామీ పథకాల కింద కూలీలుగా, 27 శాతం మంది వ్యవసాయ కూలీలుగా పని చేస్తున్నారు. కేవలం 11 శాతం మంది మాత్రమే స్వయంగా సాగు చేసుకునే రైతులు ఉన్నారు. మొత్తం జనాభాలో 17.4 శాతంగా ఉన్నప్పటికీ వివిధ రంగాల్లో దీనికి తగినంత ప్రాతినిధ్యం లేదు. 7 శాతం మంది మాత్రమే వ్యాపారాలు లేదా అనుబంధ రంగాల్లో వారి పని వారు చేసుకుంటున్నారు.



**తక్కువ వేతనాలు వచ్చే వృత్తులపైనే జీవనం**

ఇక షెడ్యూల్డ్? తెగల విషయానికి వస్తే 13 శాతం మంది రోజువారీ కూలీలుగా, 12 శాతం మంది ఉపాధి హామీ పథకాల కింద కూలీలుగా, 17 శాతం మంది వ్యవసాయ కూలీలుగా పని చేస్తున్నారు. 23 శాతం మంది స్వయంగా సాగు చేసుకునే రైతులుగా ఉన్నారు. ఇక మొత్తం జనాభాలో 10.3 శాతంగా ఉన్న ఎస్టీ విభాగంలో 17 శాతం మంది వ్యవసాయ కూలీలుగా, 13 శాతం మంది రోజువారీ కూలీలుగా, 12 శాతం మంది ఉపాధి హామీ పథకాల కింద కూలీలుగా పని చేస్తున్నారనే విషయాన్ని పరిగణనలోకి తీసుకుంటే అత్యధిక శాతం మంది తక్కువ వేతనాలు వచ్చే వృత్తులపైనే ఆధారపడి జీవిస్తున్నారని స్పష్టమవుతోంది. వీరిలో 3 శాతం మందికి మాత్రమే మధ్యతరహా లేదా భారీ స్థాయి వ్యాపారాలు సొంతంగా ఉన్నాయి.

**బీసీల్లో జనాభాకు తగ్గట్టుగా**

ఇక బీసీల విషయానికొస్తే వీరు మొత్తం జనాభాలో 52.6 శాతంగా ఉన్నారు. ఇందులో రోజువారీ కూలీలుగా పని చేసేవారిలో వీరి వాటా 58 శాతంగా ఉంది. అదేవిధంగా ఉపాధి హామీ పనుల్లో 58 శాతం కాగా, వ్యవసాయ కూలీల్లో 52 శాతంగా ఉంది. సాగుదారులుగా ఉన్న వారిలో బీసీలు 54 శాతం ఉన్నారు. వ్యాపార రంగంలో కూడా వీరి ప్రాతినిధ్యం గణనీయంగా ఉండటంతో 53 శాతంగా నమోదైంది. ప్రభుత్వ ఉద్యోగాల్లో వీరి వాటా 54 శాతం కాగా, ప్రైవేటు రంగ ఉద్యోగాల్లో 53 శాతంగా ఉంది. భారీ పరిశ్రమలు, మధ్య తరహా పరిశ్రమలు, వ్యాపార సంస్థల్లోని మొత్తం వీరు 53 శాతం ఉన్నారని నివేదికలో పేర్కొంది.

**ఓసీల్లో 4 శాతం మాత్రమే :**

ఓపెన్? కేటగిరీల విషయానికి వస్తే రోజువారీ కూలీలు, ఉపాధి హామీ కార్మికులు, వ్యవసాయ కూలీల్లో వీరి వాటా కేవలం 4 శాతం మాత్రమే. సాగుదారులతో అయితే 12 శాతం, వ్యాపారాల్లో 39 శాతం, ప్రభుత్వ ఉద్యోగాల్లో 19 శాతం, ప్రైవేటు రంగంలో 29 శాతంగా ఉంది. రాష్ట్రవ్యాప్తంగా చూస్తే మొత్తం జనాభాలో కేవలం 56.4 శాతం మంది మాత్రమే 12వ తరగతి వరకు విద్యను అభ్యసిస్తున్నారు. ఇందులో షెడ్యూల్డ్ కులాల శాతం 57 శాతంతో సగటు కంటే కొంచెం ఎక్కువగా ఉంది. ఇక బీసీలు, షెడ్యూల్డ్? తెగల విషయానికి వస్తే నమోదైన గణాంకాలు వరుసగా 54, 53 శాతంగా ఉన్నాయి.

**మరుగుదొడ్ల సౌకర్యం లేదు**

తెలంగాణలో మొత్తం జనాభాలో 13.5 శాతం మందికి మరుగుదొడ్ల సౌకర్యం అందుబాటులో లేదు. ఈ టాయిలెట్? సౌకర్యాల లేమి ఎస్టీ జనాభాలో 32.5 శాతం మంది, ఎస్సీల్లో 18.8 శాతం, బీసీల్లో 10.8 శాతం, ఓసీల్లో 4.5 శాతంగా ఉంది. వివిధ సామాజిక వర్గాల మధ్య పారిశుద్ధ్యం, ఆరోగ్యం అసమానతలకు ఈ విషయం ఒక సూచికగా గుర్తుంటుందని నివేదికలో పేర్కొంది. ప్రత్యేకించి ఈ సమస్య మహిళ భద్రత, గౌరవానికి సంబంధించిన విషమని తెలిపింది.

# విద్యాసంస్థల చెంతనే విషపు పొగ

- టేక్మాల్‌లో అక్రమ ఇటుక బట్టీల దందా

**టీ మీడియా, ఏప్రిల్ 18: టేక్మాల్:**





చట్టం తన పని తాను చేసుకుపోతుందని పాలకులు చెబుతున్నా, క్షేత్రస్థాయిలో మాత్రం నిబంధనలు తుంగలో తొక్కుతున్నారు. మెదక్ జిల్లా టేక్మాల్ మండల కేంద్రంతో టేక్మాల్,సర్మన్ కుంట తాండ గ్రామ పంచాయతీల శివారులో అక్రమ ఇటుక బట్టీలు వెలుస్తూ పర్యావరణానికి, ప్రజారోగ్యానికి పెను ముప్పుగా మారుతున్నాయి. ఎలాంటి అనుమతులు లేకున్నా యథేచ్ఛగా సాగుతున్న ఈ వ్యవహారంపై స్థానికులు మండిపడుతున్నారు. ప్రభుత్వ నిబంధనలు బేఖాతరు చట్టాలకు తూట్లుప్రభుత్వ నిబంధనల ప్రకారం ఇటుక బట్టీల ఏర్పాటుకు పర్యావరణ అనుమతులు, పంచాయతీరాజ్, మైనింగ్, రెవెన్యూ, అటవీ మరియు విద్యుత్ శాఖల నుండి క్లియరెన్స్ తప్పనిసరి. అయితే, టేక్మాల్ శివారులో నడుస్తున్న బట్టీలకు ఇలాంటి కనీస అనుమతులు లేవని సమాచారం. ముఖ్యంగా భూగర్భ జలాల పరిరక్షణ కోసం ఉద్దేశించిన వాల్టా చట్టాన్ని ఇక్కడ ఇటుక వ్యాపారులు తుంగలో తొక్కుతున్నారు. సారవంతమైన వ్యవసాయ భూముల్లో భారీ గుంతలు తీసి మట్టిని తరలిస్తుండటంతో భవిష్యత్తులో సాగు భూములు నిరుపయోగంగా మారే ప్రమాదం ఉందని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. చిన్నారుల ఆరోగ్యంతో చెలగాటం. ఈ అక్రమ బట్టీల నిర్వహణ కేవలం పర్యావరణానికే పరిమితం కాకుండా, విద్యార్థుల ప్రాణాల మీదకు తెస్తోంది. బట్టీల నుండి వెలువడే దట్టమైన పొగ నేరుగా సమీపంలోని ఆదర్శ పాఠశాల, కస్తూర్బా గాంధీ గిరిజన ఆశ్రమ పాఠశాల వైపు వెళ్తోంది. దీనివల్ల వందలాది మంది విద్యార్థులు శ్వాసకోశ ఇబ్బందులకు గురవుతున్నారు. రోజూ రాకపోకలు సాగించే వాహనదారులు, బాటసారులు పొగ. ధూళి కారణంగా కళ్ళు మండటం, ఊపిరి తీసుకోవడంలో ఇబ్బందులు పడుతున్నామని వాపోతున్నారు. అధికారుల నిర్లక్ష్యంపై ఆగ్రహంఇంత జరుగుతున్నా సంబంధిత శాఖల అధికారులు పట్టించుకోకపోవడం వెనుక లోతైన కారణాలు ఉన్నాయని గ్రామస్థులుఅనుమానం వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికే పలుమార్లు ఫిర్యాదు చేసినా ఎలాంటి చర్యలు తీసుకోకపోవడంతో విద్యార్థుల తల్లిదండ్రులు, స్థానిక సంఘాల నాయకులు అధికారుల తీరుపై నిప్పులు చెరుగుతున్నారు.


**స్థానికుల డిమాండ్**

విద్యాసంస్థల పక్కన బట్టీలు పెట్టి మా పిల్లల ఆరోగ్యంతో ఆడుకుంటున్నారు. జిల్లా ఉన్నతాధికారులు వెంటనే స్పందించి, విచారణ జరిపి ఈ అక్రమ బట్టీలను తక్షణమే తొలగించాలి. లేనిపక్షంలో పెద్ద ఎత్తున ఆందోళన చేపడతాం.

# పాడి గేదె విద్యుద్ఘాతం

**టీ మీడియా, ఏప్రిల్ 18, ,ఏప్రిల్ 18,వెల్గటూర్:**

ప్రమాదవశాత్తు విద్యుత్ షాక్ గురై పాడి పశువును కోల్పోయిన రైతును ప్రభుత్వం ఆదుకుంది. జగిత్యాల జిల్లా వెల్గటూర్ మండలం కోటిలింగాల గ్రామానికి చెందిన రైతు రాపాక మహేందర్‌కు చెందిన గేదె ఇటీవల విద్యుత్ షాక్‌తో మరణించిన సంగతి తెలిసిందే. ఈ ఘటనపై తక్షణమే స్పందించిన ప్రభుత్వం,బాధిత రైతుకు రూ.40 వేల పరిహారాన్ని మంజూరు చేసింది. శనివారం నిర్వహించిన ప్రత్యేక కార్యక్రమంలో రాష్ట్ర మంత్రి లక్ష్మణ్ కుమార్ పాల్గొని,బాధిత రైతు మహేందర్‌కు రూ. 40 వేల విలువైన పరిహారం చెక్కును అందజేశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. కష్టపడి పెంచుకున్న పాడి పశువులను కోల్పోయి నష్టపోయిన రైతులకు ప్రభుత్వం ఎల్లప్పుడూ అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు. ఇలాంటి విషాదకర సంఘటనలు పునరావృతం కాకుండా తగిన జాగ్రత్తలు తీసుకోవాలని, లైన్ల నిర్వహణలో అప్రమత్తంగా ఉండాలని విద్యుత్ శాఖ అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ సంగనభట్ల దినేష్, జగిత్యాల జిల్లా ట్రాన్స్‌కో ఎస్ఈ సుదర్శనం,డీఈ గంగారం,కోటిలింగాల గ్రామ సర్పంచ్ మొగిలి,ఇతర ప్రజా ప్రతినిధులు విద్యుత్ శాఖ అధికారులు పాల్గొన్నారు. తన గోడును ఆలకించి, తక్షణమే ఆర్థిక సాయం అందేలా కృషి చేసిన మంత్రి లక్ష్మణ్ కుమార్‌కు,సంబంధిత అధికారులకు రైతు మహేందర్ ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.



# బిజెపి ఎంపీ తేజస్వి సూర్య దిష్టిబొమ్మ దగ్ధం

- కాంగ్రెస్ పార్టీ నాయకులు

**టీ మీడియా ,ఏప్రిల్ 18, రామకృష్ణాపూర్:**

క్యాతనపల్లి మున్సిపాలిటీ గద్దెరాగడిలో శనివారం కాంగ్రెస్ జిల్లా అధ్యక్షులు రఘునాథరెడ్డి, పట్టణ అధ్యక్షులు పల్లె రాజు ఆధ్వర్యంలో ఎంపీ తేజస్వీ సూర్య దిష్టిబొమ్మని దగ్ధం చేసి కాంగ్రెస్ నాయకులు నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ తెలంగాణ ఉద్యమం,తెలంగాణ రాష్ట్ర ఏర్పాటు గురించి తెలియని బిజెపి ఎంపీ తేజస్వి సూర్య లోక్‌సభలో ఇండియా,పాకిస్తాన్ విభజన లాగా జరిగిందని అవహేళనగా మాట్లాడడం సరికాదని మండిపడ్డారు. నీలాంటి విలువలేని వాళ్లకు తెలంగాణను పాకిస్తాన్తో పోల్చడం సరి కాదని అన్నారు. తెలంగాణ రాష్ట్రమేమి ఒక్కరు సాధించిన త్యాగఫలం కాదు. ఇక్కడి తెలంగాణ ప్రజలందరూ స్వరాష్ట్రం కోసం పోరాటం చేసి ఎంతోమంది ప్రాణ బలిదానాలకు సిద్ధపడి తెలంగాణను తీసుకొచ్చుకుంటే , కారు కూతలు కూసే బిజెపి ఎంపీ తేజస్వీ సూర్య లాంటి బచ్చగాళ్ళకి తెలంగాణ రాష్ట్ర చరిత్ర గురించి ఎలా తెలుస్తుంది అని మండిపడ్డారు. ఇకపై నువ్వు తెలంగాణ మాట ఎత్తితే ఢిల్లీలో కూడా నిన్ను అడ్డుకుంటామని చెప్పారు. చిత్తశుద్ధి లేని తెలంగాణ బిజెపి ఎంపీలు తెలంగాణ గురించి ఇంత మాట్లాడుతున్న ఒక్కసారి కూడా నిలదీయకుండా వాడి వెనకనే వంత పాడటం నిజంగా సిగ్గుచేటని కాంగ్రెస్ నాయకులు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ జిల్లా అధికార ప్రతినిధి ఒడ్నాల శ్రీనివాస్,బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షులు గోపతి రాజయ్య,మాజీ చైర్ పర్సన్ జంగం కౌన్సిలర్లు గుర్రం శ్రీనివాస్ ,భీమా మల్లేష్,మహిళ నాయకురాళ్లు, పట్టణ కాంగ్రెస్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.



# జాగృతి కళాశాల విద్యార్థులను సన్మానించిన ప్రభాకర్ రెడ్డి

**టీ మీడియా, ఏప్రిల్ 18, వనపర్తి బ్యూరో :**





రాష్ట్ర స్థాయి 2వ ర్యాంకు ఉమ్మడిజిల్లా 1వ ర్యాంకును సాధించిన జాగృతి విద్యార్థులను ఘనంగా సన్మానించిన బీజేపీ రాష్ట్ర నాయకులు అయ్యగారి ప్రభాకర్ రెడ్డి. ఐపిఈ 2026 ప్రథమ, ద్వితీయ సంవత్సరం ఫలితాలలో పట్టణంలోని జాగృతి కళాశాల విద్యార్థులు రాష్ట్ర స్థాయిలో × బైపిసి లో ఉజ్మా హజారా 438 /440 మార్కులతో 2వ ర్యాంకును, అదే విధంగా ×× బైపిసి లో హెచ్. అనుష్క 994/1000 మార్కులతో ఉమ్మడిజిల్లా మొదటి ర్యాంకును సాధించి మరొకసారి వనపర్తిలో ప్రతిభ చాటారు. ఈ విషయాన్ని తెలుసుకున్న బిజెపి రాష్ట్ర నాయకులు అయ్యగారి ప్రభాకర్ జాగృతి కళాశాలకు వచ్చి స్టేట్ ర్యాంకర్లను ఘనంగా సన్మానించారు. ఈ సంధర్భంగా అయ్యగారి ప్రభాకర్ మాట్లాడుతూ సాధారణ విద్యార్థులతో కార్పొరేట్ స్థాయి మార్కులతో, స్టేట్ ర్యాంకులను, ఉమ్మడి మహబూబ్ నగర్ జిల్లా ఫస్ట్ ర్యాంకులను సాధిస్తూ ఉమ్మడి జిల్లాలో అద్భుతమైన ఫలితాలు సాధిస్తున్నందుకు జాగృతి కళాశాల విద్యార్థులను అభినందించారు.



జేఈఈ మెయిన్ -2026 సెక్షన్-× ఫలితాలలో సిహెచ్.అర్జున్ 91.69 పర్సంటైల్ తో 5 అగ్రగామిగా నిలవడం జరిగింది అని కొనియాడారు. జిల్లాలో ఇంటర్ విద్యలో ఐపిఈ మార్కులతో పాటు జేఈఈ నీట్ , ఎంసెట్ లలో కూడా కార్పొరేట్ కళాశాలలకు దీటుగా జాగృతి కళాశాల నిలవడం ఎంతో సంతోషంగా ఉంది అని జాగృతి కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ అంబటి వినోద్ కుమార్ ని యజమాన్య సభ్యులు భాస్కర్ , శ్యామ్ కుమార్ సత్యనారాయణ ను ప్రత్యేకంగా అభినందించారు. ఈ కార్యక్రమంలో లోకనాథ్ రెడ్డి, రామన్నగారి వెంకటేశ్వర్ రెడ్డి, నక్క మహేష్ యాదవ్ 30 వ వార్డ్ బీజేపీ అభ్యర్థి, గోపినాథ్ ఆచార్య, కొమ్ము శ్రీను, పవన్, పెద్దిరాజు బిజెపి ప్రధాన కార్యదర్శి చెన్నరాయుడు, శివ తదితరులు పాల్గొన్నారు.

# విజ్ఞాన్ కళాశాల విద్యార్థుల విజయ దుందుభి

- విద్యార్థులను సన్మానం చేసిన మాజీ మంత్రి సింగిరెడ్డి నిరంజన్ రెడ్డి

**టి మీడియా, ఏప్రిల్ 18, వనపర్తి బ్యూరో :**



వనపర్తి జిల్లా కేంద్రంలోని కొత్త బస్టాండ్ దగ్గర గల విజ్ఞాన్ జూనియర్ కళాశాల ఈ సంవత్సరం ఇంటర్మీడియట్ ఫలితాలలో బైపిసి మొదటి సంవత్సరం చదువుతున్న భవాని, అములేశ్వరి లకు 436 మార్కులతో రాష్ట్రస్థాయి నాలుగవ ర్యాంకులతో విజయ దుందుభి మోగించారు. అదేవిధంగా ఎంపీసీ రెండవ సంవత్సరంలో భవాని 992 మార్కులతో రాష్ట్రస్థాయి ఐదవ ర్యాంకులు సాధించడమే కాకుండా బైపిసి మొదటి సంవత్సరంలో రాణి 440 5 431, 2 సంవత్సరంలో 470కి కృష్ణకుమార్ 456 జి ప్రియాంక 454, సీసీ మొదటి సంవత్సరంలో 500 మార్కుల గాను అశోక్ కుమార్ 473 బబ్లు నాయక్ 456, సీనియర్ ఎంపీసీ నందు వెయ్యి మార్కుల గాను సి దివ్య 986 ఎస్ఎండి సోయల్ 986, సీనియర్ సిఈసికి 1000 మార్కుల గాను ఆర్ గణేష్ 975 సీనియర్ బైపీసీలో 1000 మార్కుల గాను వాకిటి పావని 975 ఎస్ చందు 975 లను సాధించారు. ర్యాంకులను సాధించిన విద్యార్థిలను మాజీ రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి సింగిరెడ్డి నిరంజన్ రెడ్డి శాలువాలతో ఘనంగా సత్కరించారు. అదే విధంగా కరస్పాండెంట్ రాజేష్, డైరెక్టర్ క్రాంతి, ప్రిన్సిపల్ శిఖామణి లు అభినందించి సత్కరించారు.





# పుర పాలక వర్గ కమిటీని సన్మానించిన పట్టణ రజక సంఘం

**టీ మీడియా, ఏప్రిల్ 18, రామకృష్ణాపూర్:**





క్యాతనపల్లి మున్సిపాలిటీలో శనివారం పట్టణ రజక సంఘం ఆధ్వర్యంలో నూతనంగా ఎన్నికైన చైర్ పర్సన్ గొడిసెల సంధ్యారాణి రాజారమేష్, వైస్ ఛైర్మన్ మిట్టపల్లి సరిత శ్రీనివాస్ లను,కౌన్సిల్ సభ్యులను శాలువాలతో ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా చైర్ పర్సన్ మాట్లాడుతూ తొలి భూ పోరాటానికి నాంది పలికిన వీరమాత చాకలి ఐలమ్మ అని వారి పోరాట స్ఫూర్తి గొప్పదని కొనియాడారు. రజక సంఘం వారికి ఎటువంటి సమస్యలు తలెత్తిన తెలియచేయాలని వెంటనే సమస్య పరిష్కారానికి కృషి చేస్తామని,అందరం ఒక్కటిగా మన క్యాతనపల్లి మున్సిపాలిటీ అభివృద్ధి కోసం ముందుకు కొనసాగుదామని కోరారు. ఈ సమావేశంలో బిఆర్ఎస్ సీనియర్ నాయకులు గాండ్ల సమ్మయ్య ,రామిడి కుమార్, ఆర్నె సతీష్,యూత్ నాయకులు రామిడి లక్ష్మీకాంత్, మణి,సిపిఐ నాయకులు రామడుగు లక్ష్మణ్, రజక సంఘం గౌరవ అధ్యక్షులు మణికంటి రాజయ్య, అధ్యక్షులు నడికోట తిరుపతి, శంకర్ ,మహిళా అధ్యక్షురాలు జలిగపు రాజేశ్వరి తదితర సభ్యులు పాల్గొన్నారు.

# మోసపోయానని, మోసగించడం ప్రారంభించాడు

- హైదరాబాద్ పోలీసులకు దొరికిపోయాడు

**టీ మీడియా, ఏప్రిల్ 18, , హైదరాబాద్ బ్యూరో :**





సైబర్ నేరగాళ్ల ముఠాలో చిక్కి మోసగించడం నేర్చుకున్నాడు. ఆ అనుభవంతో డబ్బు సంపాదించేందుకు అదే అడ్డదారిని ఎంచుకున్నాడు. డిజిటల్ అరెస్ట్?ల పేరుతో ఎంతో మంది అమాయకులను బెదిరించి రూ.లక్షలు కొల్లగొట్టాడు. విదేశాల్లో ఉన్న తనను ఎవరూ గుర్తించలేరు, పట్టుకోలేరనే ధీమాలో ఉన్నాడు. ఈ క్రమంలోనే రెండేళ్ల తర్వాత కంబోడియా నుంచి హైదరాబాద్? నగరానికి వచ్చి పోలీసులకు చిక్కాడు. సైబర్? క్రైంలతో సంబంధమున్న నిందితుడు గాజర్ల అవినాశ్?(26) అనే వ్యక్తిని అరెస్టు చేసినట్లుగా సైబరాబాద్ సైబర్ క్రైం డీసీపీ టి.సాయిమనోహర్ వెల్లడించారు. ఈ మేరకు ఏసీపీ రవీందర్? రెడ్డితో కలిసి డీసీపీ సాయిమనోహర్ మీడియాకు వివరాలను వెల్లడించారు.

**పోలీసుల కథనం ప్రకారం :**

జగిత్యాల జిల్లాలోని మేడిపల్లి మండలం కట్లకుంటకు చెందిన గాజర్ల అవినాశ్ అనే యువకుడు బీటెక్ చదువును మధ్యలోనే ముగించాడు. 2024లో ఖతార్‌లో ఉద్యోగం చేస్తున్న శశి అనే వ్యక్తి పరిచయమై కంబోడియాలో డేటా ఎంట్రీ జాబ్స్? నమ్మించాడు. అతడు చెప్పింది నిజమేనని భావించిన అవినాశ్ పాస్‌పోర్టు సంపాదించి కంబోడియా చేరాడు. అక్కడ సైబర్ నేరగాళ్ల ముఠా చేతికి చిక్కాడు. చివరికి తాను మోసపోయినట్టు గ్రహించి బయటపడే దారిలేక వారు చెప్పినట్టు భారతీయుల ఫోన్ నంబర్లకు ఫోన్‌చేసి పెట్టుబడులు, ఓటీపీ, నల్లా బిల్లులు, డిజిటల్ అరెస్ట్, ఏపీకే ఫైల్స్, పేరిట భయపెట్టడం, వచ్చిన సొమ్మును మ్యూల్ బ్యాంకు అకౌంట్లలో జమ చేయటం చేసేవాడు. మొదట్లో కాస్త ఇబ్బంది పడ్డాడు. ఆ తర్వాత పోలీసులు దాడులు నిర్వహించడంతో అక్కడ పనిచేస్తున్న చాలామంది వారివారి స్వదేశాలకు వెళ్లిపోయారు. అవినాశ్ మాత్రం అక్కడే ఉండి సైబర్ మోసాలకు పాల్పడటమే వృత్తిగా ఎంచుకున్నాడు. ఈ క్రమంలోనే ఆంధ్రప్రదేశ్?, తెలంగాణకు చెందిన కొందరికి కమీషన్ ఆశచూపి ఏజెంట్లుగా మార్చుకున్నాడు. సైబర్ గ్యాంగ్?లతో సంబంధం లేకుండా తానే డిజిటల్ అరెస్ట్ మోసాలతో రూ.లక్షలు సంపాదించటం ప్రారంభించాడు. వచ్చిన నగదును మ్యూల్ అకౌంట్లో జమ చేయించేవాడు. వారికి కమీషన్ ఇచ్చి మిగిలిన సొమ్మును బ్యాంక్ నుంచి డబ్బులు డ్రా చేయించి ఏజెంట్ల ద్వారా తన కుటుంబసభ్యులకు అందజేసేవాడు. 15 రోజుల వ్యవధిలోనే తండ్రికి రూ.16లక్షలు అప్పగించాడు. తన ఆనవాళ్లు తెలియకుండా సైబర్ క్రైం దందా సాగిస్తూ పట్టుబడననే ధీమాకు వచ్చాడు.

**లింక్‌లు ఎలా బయటపడ్డాయంటే**

ఇటీవల డిజిటల్ అరెస్ట్ పేరిట సైబర్ మోసగాళ్ల చేతిలో మోసపోయిన బాధితుడి ఫిర్యాదుతో సైబరాబాద్ సైబర్‌క్రైమ్ పోలీసులు కేసు నమోదు చేశారు. దర్యాప్తు చేపట్టిన పోలీసులు నగదు జమ చేసిన బ్యాంకు ఖాతా విశాఖకు చెందిన కృష్ణ అనే వ్యక్తి పేరిట ఉన్నట్టుగా గుర్తించారు. అతడిని అదుపులోకి తీసుకొని ప్రశ్నించగా శశి, ధనుంజయమూర్తి పేర్లు బయటకొచ్చాయి. వారిని ప్రశ్నించినపుడు కంబోడియాకు చెందిన గ్యాంగ్ చెప్పినట్టు చేస్తున్నామని, తమ కమీషన్ తీసుకుని మిగిలిన రూ.10 లక్షలు అవినాశ్ సూచించిన వ్యక్తికి అందజేసినట్టుగా వెల్లడించారు. ఆ వివరాలతో పోలీసులు కూపీ లాగితే అవినాశ్ మోసాల చిట్టా వెలుగులోకి వచ్చింది. ఇతడి కదలికలపై నిఘా ఉంచిన పోలీసులు శంషాబాద్ ఎయిర్?పోర్టు చేరినట్టు సమాచారం అందగానే అదుపులోకి తీసుకున్నారు. ఊహించని ఘటనతో ఉలికిపాటుకు గురైన నిందితుడు పోలీసుల విచారణలో అసలు విషయం బయటపెట్టాడు. నిందితుడి నుంచి రూ.12 లక్షల నగదు, పాస్‌పోర్టు, స్మార్ట్?ఫోన్ స్వాధీనం చేసుకున్నారు. నిందితుడిని పోలీసు కస్టడీకి తీసుకొని కంబోడియా లింక్‌లను గుర్తిస్తామని డీసీపీ వెల్లడించారు.

# ఈఎమ్ఐలు కట్టలేదని వికలాంగుడి ఇంటికి తాళం

**టీ మీడియా, ఏప్రిల్ 18,రాజన్న సిరిసిల్ల:**





ఈఎమ్ఐలు కట్టట్లేదని ఓ ప్రైవేట్ బ్యాంక్ సిబ్బంది వికలాంగుడి ఇంటికి తాళం వేసిన సీజ్ చేసిన ఘటన రాజన్న సిరిసిల్ల పట్టణంలో వెలుగు చూసింది. ఇందిరానగర్‌కు చెందిన భోగం గోపాల్ అనే వ్యక్తి నాలుగేళ్ల క్రితం తన ఇంటిని తాకట్టు పెట్టి కరీంనగర్‌లోని ఐకేఎఫ్ ప్రైవేట్ ఫైనాన్స్ సంస్థ నుంచి రూ.8 లక్షలు రుణంగా తీసుకున్నాడు. ఆర్థిక ఇబ్బందులు ఉన్నప్పటికీ గోపాల్ ఇప్పటి వరకు క్రమంగా ఈఎంఐలు చెల్లిస్తూ వచ్చాడు. అయితే మూడేళ్ల క్రితం షుగర్ వ్యాధి బారిన పడిన గోపాల్ ఆరోగ్యం క్షీణించడంతో ఏడాది క్రితం వైద్యులు అతని కాలు తొలగించారు. అయినప్పటికీ కుటుంబ పోషణతో పాటు రుణ చెల్లింపులు కొనసాగించాడు. ఇటీవల ఆరోగ్య సమస్యల కారణంగా నాలుగు ఈఎంఐలు మాత్రమే చెల్లించలేకపోయాడు. అయితే నాలుగు రోజుల క్రితం బ్యాంకు సిబ్బంది ఇంటికి వచ్చి రుణం వెంటనే చెల్లించాలని డిమాండ్ చేశారు. మధ్యాహ్నం మరోసారి వచ్చిన సిబ్బంది ఒక్కసారి బయటికి రండి.. ఒకసారి ఇంటికి తాళం వేసి ఫోటో తీసుకుంటామని చెప్పి కుటుంబాన్ని బయటకు పంపించి, అనంతరం ఇంటికి తాళం వేసి నోటీసులు అంటించి వెళ్లిపోయినట్లు బాధితులు ఆరోపిస్తున్నారు. దీంతో గోపాల్ కుటుంబం ఒక్కసారిగా ఆశ్రయం కోల్పోయి రోడ్డున పడ్డారు. విషయం తెలుసుకున్న స్థానికులు స్పందించి తాత్కాలికంగా టెంట్ ఏర్పాటు చేయగా, తర్వాత బంధువులు వారిని ఎల్లారెడ్డిపేటకు తరలించారు. గోపాల్ ఆరోగ్య పరిస్థితి బాగాలేదని, కొంత సమయం ఇవ్వాలని ఎంత బతిమాలినా బ్యాంకు సిబ్బంది స్పందించలేదని కుటుంబ సభ్యులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఈ ఘటనపై కాలనీవాసులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తూ, బాధిత కుటుంబానికి న్యాయం చేయాలని, సంబంధిత సిబ్బందిపై చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్‌ను కోరుతున్నారు.





# సాఫ్ట్‌వేర్ ఉద్యోగి ఆత్మహత్య..

- పెరుగుతున్న మానసిక ఒత్తిడి కేసులు


**టీ మీడియా, ఏప్రిల్ 18, , హైదరాబాద్ బ్యూరో :**

హైదరాబాద్ రాజేంద్రనగర్ పోలీస్ స్టేషన్ పరిధిలోని హైదర్‌గూడలో 35 ఏళ్ల వెంకటేష్ అనే సాఫ్ట్‌వేర్ ఉద్యోగి తన ఇంట్లో ఫ్యాన్‌కు ఉరివేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. కుటుంబ సభ్యులు అంత పిరికివాడు కాదు, ఆత్మహత్య ఎందుకు చేసుకున్నాడో తెలియదు అని చెబుతున్నారు. ఘటనా స్థలానికి క్లూస్ టీమ్‌తో చేరుకున్న పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. ఈ మధ్య కాలంలో ఆత్మహత్యలు పెరుగుతున్నాయి. ఆత్మహత్యల్లో 2025లో దేశంలో 4వ స్థానంలో ఉంది తెలంగాణ రాష్ట్రం. తెలంగాణలో నిరుద్యోగం, కుటుంబ సమస్యలు, మానసిక ఒత్తిడి ప్రధాన కారణాలుగా గుర్తిస్తున్నారు పోలీసులు. సాఫ్ట్‌వేర్ ఉద్యోగుల్లో పని ఒత్తిడి, వ్యక్తిగత సమస్యలు ఈ ట్రెండ్‌ను మరింత తీవ్రతరం చేస్తున్నాయి. 2025 ఏప్రిల్ శంకర్‌పల్లిలో ఆర్థిక ఇబ్బందులు, కుమారుడి అప్పులతో హన్మంత్రెడ్డి అనే వ్యక్తి ఆత్మహత్య చేసుకున్నాడు. రైతు కుటుంబాల్లో ఇలాంటి కేసులు పెరుగుతున్నాయి. 2025 జనవరి రాజేంద్రనగర్ లో పెళ్లి అయిన 3 వారాలకే సాఫ్ట్‌వేర్ ఉద్యోగి అరుణ్ (28) ఆత్మహత్య చేసుకున్నాడు. 2026 ఫిబ్రవరి లో హైదరాబాద్ లో సాఫ్ట్‌వేర్ ఇంజనీర్ ఉద్యోగ ఒత్తిడితో ఆత్మహత్య చేసుకున్నాడు. 2026 మార్చిలో కొండాపూర్‌లో మనుశ్రీ (32) పని ఒత్తిడితో ఉరివేసుకుంది. మానసిక నిపుణులు పని ఒత్తిడి, కలహాలు, ఆర్థిక సమస్యలు ప్రధాన కారణాలని చెబుతున్నారు. ఐటీ హబ్‌ల సమీపంలో ఇలాంటి ఘటనలు తరచూ నమోదవుతున్నాయి. ఆత్మహత్యలు పెరగడానికి కారణాలు అనేకం సాఫ్ట్‌వేర్ ఉద్యోగుల్లో పోటీతత్వం, లాంగ్ అవర్స్ మానసిక సమస్యలకు దారితీస్తున్నాయి. మానసిక ఆరోగ్యం చాలా ముఖ్యం ఒత్తిడికి చికిత్స లేకపోవడం వల్ల కేసులు పెరుగుతున్నాయి. తెలంగాణలో మానసిక సమస్యలతో ఆత్మహత్యలు గణనీయంగా ఎక్కువ అని లెక్కలు చెబుతున్నాయి. పోలీసులు వెంకటేష్ కేసులో మొబైల్ రికార్డులు, సోషల్ మీడియా చెక్ చేస్తున్నారు. కుటుంబం, సహోద్యోగుల నుంచి వివరాలు సేకరిస్తున్నారు. రంగారెడ్డి జిల్లాలో ఆత్మహత్యలు 20% పెరిగినట్టు లెక్కలు చెబుతున్నాయి. మానసిక ఒత్తిడి వచ్చినప్పుడు కౌన్సెలింగ్ తీసుకోవాలి. 104 హెల్ప్‌లైన్ కి కాల్ చేయొచ్చు.

# జాతిని తక్కువ చూపే కుట్ర

- వాకిటి.శ్రీధర్ ముదిరాజ్

**టీ మీడియా, ఏప్రిల్ 18, వనపర్తి బ్యూరో :**





తెలంగాణ ముదిరాజు మహాసభ హైదరాబాద్ వాసవి క్లబ్ లో జరిగింది. ఇట్టి సభలో పాల్గొన్న మాజీ మున్సిపల్ వైస్ చైర్మన్ వాకిటి శ్రీధర్ ముదిరాజ్ మాట్లాడుతూ రాష్టములో ఏ రాజకీయ పార్టీ అధికారంలోకి రావాలి అన్నా కీలకపాత్ర పోషించేది ముదిరాజులు అని అటువంటి ముదిరాజ్ కులస్థులను కులగణనలో తక్కువ చూపే భారీ కుట్ర జరుగుతుందని ఆరోపించారు. 2011 కులగణాల ప్రకారం రాష్టములో రెండవ స్థానములో ఉన్న ముదిరాజులు నేడు ఎటువంటి స్థానములో ఉంటారో ఆలోచించాలని అన్నారు. అన్ని రాజకీయ పార్టీలలో దామాషా ప్రకారం మన పదవులు మనం పొందాలి అన్న ఏకైక లక్ష్యంతో అధ్యక్షులు బండ.ప్రకాష్ జిల్లాల పర్యటన చేపట్టాలని పిలుపునిచ్చారు. కాంగ్రెస్ పార్టీ ముదిరాజులను మోసం చేసిందని బీసీ డీ నుండి ఏ గ్రూపులోకి మారుస్తామని ఎన్నికల మేనిఫెస్టో లో పెట్టి రెండున్నర సంవత్సరాలు అయినా పట్టించుకోవడమే లేదని కెసిఆర్ ప్రవేశపెట్టిన ఉచిత చేప పిల్లల పంపిణీ 20/: కి తగ్గించిందని అన్నారు. బండ. ప్రకాశ్ జిల్లా పర్యటనలకు సహకరించి మన సామాజిక వర్గం కోసం కలసికట్టుగా పోరాడదామని కోరారు. సామాజిక వర్గంలో ఒకరిని సంతృప్తి పరిచి మొత్తం సామాజిక వర్గం సేవలు ఉపయోగించడం వల్ల మనం తక్కువగా కనిపిస్తున్నామని హితవు పలుకుతూ ఐక్యంగా పోరాడి మన హక్కులు సాధించుకోవాలని పిలుపు ఇచ్చారు. సమావశంలో డిఎఫ్సిఎస్ చైర్మన్ పుట్ట బాలరాజు, చుక్క శేఖర్, రామన్ పాడు వెంకటస్వామి పాల్గొన్నారు.

# ఫుట్ పాత్‌లపై అక్రమ నిర్మాణాల కూల్చివేత

- **స్పెషల్ డ్రైవ్‌లో భాగంగా తొలగింపు**

**టీ మీడియా, ఏప్రిల్ 18, , హైదరాబాద్ బ్యూరో :**
హైదరాబాద్ నగరంలో ఫుట్ పాత్?లను ఆక్రమించి నిర్మించిన అక్రమ నిర్మాణాలపై జీహెచ్ఎంసీ అధికారులు కొరఢా ఝులిపించారు. ప్రతి శనివారం చేపట్టే స్పెషల్ డ్రైవ్?లో భాగంగా రాజేంద్రనగర్, శంషాబాద్, చార్మినార్, గొల్కొండ, ఖైరతాబాద్, సికింద్రాబాద్ జోన్?లలో రహదారులను ఆక్రమించి చేపట్టిన నిర్మాణాలను జేసీబీల సాయంతో అధికారులు కూల్చివేశారు. అన్ని ప్రాంతాల్లో ఉదయం 7 గంటల నుంచి మొదలైన కూల్చివేతలు మధ్యాహ్నం 2 గంటల వరకు జరిగినట్లు జీహెచ్ఎంసీ టౌన్ ప్లానింగ్ అధికారులు తెలిపారు. కూల్చివేతలపై ఆందోళనలు వ్యక్తం అవుతాయని ముందే ఊహించిన అధికారులు పోలీసుల బందోబస్తు మధ్య కూల్చివేతలు చేపట్టారు. మొత్తంగా కూల్చివేతలు జరిగిన ప్రాంతాల్లో ఉద్రిక్త వాతావరణం నెలకొంది.

**కట్టుదిట్టమైన భద్రత**
హైదరాబాద్? నగరంలోని రహదారులకు ఇరువైపుల ఉన్నటువంటి ఫుట్ పాత్?లపై నిర్మించిన అక్రమ నిర్మాణాలను జేసీబీల సాయంతో జీహెచ్ఎంసీ అధికారులు కూల్చివేశారు. నిబంధనలు అతిక్రమించి ఫుట్ పాత్?లపై, నాలాలపై దుకాణాదారులు నిర్మించిన అక్రమ నిర్మాణాల తొలగింపునకు జీహెచ్ఎంసీ అధికారులు చేపట్టిన స్పెషల్ డ్రైవ్ ప్రతీ శనివారం కొనసాగుతుంది. ఇందులో భాగంగా కూల్చివేతల కార్యక్రమాన్ని చేపట్టిన అధికారులు రాజేంద్రనగర్ జోన్, రాజేంద్రనగర్, అత్తాపూర్ సర్కిళ్లలోని పిల్లర్ నెంబర్ 116నుంచి ఆరంఘర్?లోని పిల్లర్ నెంబర్ 252వరకు ఫుట్ పాత్?లపై గల అక్రమ నిర్మాణాలను తొలగించారు. అలాగే శంషాబాద్ జోన్ బడంగ్ పేట్ సర్కిల్?లోని మున్సిపల్ కార్యాలయం క్రాస్ రోడ్ నుంచి ఆదిబట్లలోని హెచ్ఎండబ్ల్యూఎస్ఎస్?బీ పంప్ హౌస్ వరకు చార్మినార్ జోన్ సంతోష్



నగర్ సర్కిల్లో కందికల్ బ్రిడ్జి నుంచి ఛత్రినాక జంక్షన్ వరకు గొల్కొండ జోన్ కార్వాన్, మెహిదిపట్నం సర్కిళ్లలో యాదవ్ భవన్ క్రాస్ రోడ్ నుంచి గుడిమల్కాపూర్?లోని పిల్లర్ నెంబర్ 168 వరకు, అలాగే ఖైరాతాబాద్ జోన్, ఖైరతాబాద్ సర్కిల్లో కాచిగూడ జంక్షన్ మహేశ్వరి పరమేశ్వరి మొదలు సుల్తాన్ బజార్ పోలీస్ స్టేషన్ నుంచి ఆంధ్రా బ్యాంక్ వరకు ఫుట్ పాత్?లపై అక్రమ నిర్మాణాలను జీహెచ్ఎంసీ టౌన్ ప్లానింగ్ అధికారులు కూల్చివేశారు. ఇదే క్రమంలో సికింద్రాబాద్ జోన్ కవాడిగూడ సర్కిల్లో గాంధీ భవన్ నుంచి పద్మారావు నగర్ కాలనీ పార్క్ చుట్టుపక్కల ఈ కూల్చివేతలు జరిగినట్లు అధికారులు పేర్కొన్నారు. ఉదయం 7గంటలకు మొదలైన ఫుట్ పాత్ ఆక్రమణల కూల్చివేతలు మధ్యాహ్నం 2 గంటల వరకు జరిగినట్లు జీహెచ్ఎంసీ టౌన్ ప్లానింగ్ అధికారులు తెలిపారు. కూల్చివేతల్లో భాగంగా ఎలాంటి అవాంచనీయ ఘటనలు జరగకుండా పోలీసులు కట్టుదిట్టమైన భద్రత ఏర్పాటు చేశారు.

**అరెస్టు చేస్తామని బెదిరించారు**
కూల్చివేతలపై ఎలాంటి ముందస్తు నోటీసులు ఇవ్వలేదని పలు ప్రాంతాల్లోని దుకాణాదారులు, బాధితులు తెలిపారు. రాజేంద్రనగర్ అత్తాపూర్లో మాత్రం శుక్రవారం మధ్యాహ్నం సమయంలో ఓ అధికారి వచ్చి సమాచారం ఇచ్చినట్లు దుకాణాదారులు పేర్కొన్నారు. డివైడర్ నుంచి 75 మీటర్ల వరకు ఉన్న నిర్మాణాలను కూల్చివేస్తామని అధికారి చెప్పారంటున్న బాధితులు అంత స్థలంలోని తమ నిర్మాణాలను రాత్రికి రాత్రే తొలగించామని, అయినా 75 మీటర్లు దాటి ఉన్న నిర్మాణాలను సైతం అధికారులు కూల్చివేస్తున్నట్లు స్థానిక దుకాణదారులు ఆందోళన వ్యక్తం చేశారు. కూల్చివేతల సమయానికి ఒక్క రోజు ముందు ఎలా సమాచారం ఇస్తారని నిలదీశారు. కూల్చివేతలపై అధికారులను అడిగితే పోలీసులు అరెస్టు చేస్తామని బెదిరించినట్లు దుకాణదారులు ఆందోళన వ్యక్తం చేశారు. ఈ తరహా కూల్చివేతలతో మానసికంగా క్షోభకు గురవుతున్నట్లు చెబుతున్నారు.

### ఫుట్ పాత్?లను ఆక్రమించి నిర్మాణాలు

ఫుట్ పాత్?ల ఆక్రమణలపై దృష్టి సారించిన జీహెచ్ఎంసీ అధికారులు ప్రభుత్వ సూచనల మేరకు ప్రతీ శనివారం ఈ స్పెషల్ డ్రైవ్ కార్యక్రమాన్ని చేపడుతున్నట్లు తెలిపారు. గత కొన్నాళ్లుగా కొనసాగుతున్న ఈ పరంపర ముందున్న కూడా చేపట్టే అవకాశం ఉన్నట్లు తెలిపారు. కాగా నగరంలో ఫుట్ పాత్?ల ఆక్రమణ యథేచ్ఛగా జరుగుతుంది. ఫుట్ పాత్?లను ఆక్రమించి నిర్మాణాలు చేపట్టడంతో అటు పాదచారులకు, ఇటు వాహనదారులకు ఇబ్బందిగా మారుతుంది. పలుచోట్ల నాలాలను ఆక్రమించి మరీ వాటిపై నిర్మాణాలు చేపట్టడంతో రహదారులపైకి నీరు చేరుతోందని జీహెచ్ఎంసీ అధికారులు తెలిపారు.



## ఫలితాలలో ప్రతిభ చూపిన మైనారిటీ విద్యార్థినిలు

- **సన్మానించిన అభినందించిన మాజీ మంత్రి**

**టీ మీడియా, ఏప్రిల్ 18, వనపర్తి బ్యూరో :**
ప్రభుత్వ ఉర్దూ జూనియర్ కళాశాల విద్యార్థినిలు ఇంటర్ ఫలితాలలో తమ ప్రతిభ చాటినారు. ఎం.పి.సి మొదటి సంవత్సరంలో అఫ్సా ఖైరన్ 470మార్కులకు గాను 459మార్కులు సాధించింది. ఎం.పి.సి రెండవ సంవత్సరంలో సాయిదా అతియా మహమూది 1000మార్కులకు గాను 916 మార్కులు సాధించింది. సి.ఈ.సి రెండవ సంవత్సరంలో 1000 మార్కులకు గాను843 మార్కులు సాధించింది. విషయం తెలుసుకున్న మాజీ మంత్రి సింగిరెడ్డి నిరంజన్ రెడ్డి వారి స్వగృహంలో విద్యార్థినులను ఘనంగా సన్మానించి అభినందించారు. ఈ సందర్భంగా నిరంజన్ రెడ్డి మాట్లాడుతూ విషయం విద్యార్థులు కష్టంతో కాకుండా ఇష్టంతో చదివితే ఉత్తమ ఫలితాలు సాధిస్తారని అన్నారు. చదువులోనే కాకుండా విద్యార్థులు పరిసరాలు,సమాజం ,కుటుంబం పట్ల అవగాహన కల్పించుకొని సమాజ అభివృద్ధికి తోడుపడుతూ పుట్టిన ఊరికి,తల్లిదండ్రులకు మంచి పేరు తీసుకురావాలని పిలుపునిచ్చారు. విద్యార్థినులకు నిరంజన్ రెడ్డి స్వయంగా స్వీట్స్ పంచి తన ఆనందాన్ని వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమములో అధ్యాపక బృందం నాజియా బేగం,అబ్దుల్ రెహ్మాన్నాయకులు గట్టు యాదవ్ వాకిటి శ్రీధర్, నందిమల్ల. అశోక్,కె.మాణిక్యం, బండారు.కృష్ణ, జోహెబ్ హుస్సేన్, సయ్యద్.జమీల్, స్టార్.రహీమ్, అస్లాం, మాధవ్ రెడ్డి, వెంకట్ సాగర్, మహేశ్వర్ రెడ్డి,చిట్యాల.రాము, అలీమ్, తోట.శ్రీను తదితరులు ఉన్నారు.

## 26 వరకు వర్షాలు కురిసే అవకాశం

**(మొదటిపేజీ తరువాయి...)**
సృష్టించింది. చేతికి వచ్చిన వరి పంట పూర్తిగా నేలకొరిగింది. కొనుగోలు కేంద్రాల వద్ద ఆరబోసిన ధాన్యం తడిసి ముద్దైంది. సిరికొండ, ధర్పల్లి, డిచ్?పల్లి, ఇందల్వాయి మండలంలో పొద్దంతా ఎండ కొట్టి సాయంత్రం అకాల వర్షం పడడంతో పంటను కాపాడుకోలేక రైతులు సతమతం అయ్యారు. అకాల వర్షాలను దృష్టిలో ఉంచుకొని అయినా తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం కొనుగోలు వేగవంతం చేయాలని రైతులు ప్రభుత్వాన్ని వేడుకుంటున్నారు. ఉత్తర తెలంగాణ జిల్లాల్లో వడగాల్పులు వీస్తున్నాయి : మరోవైపు రాష్ట్ర వ్యాప్తంగా ఎండలు మండిపోతున్నాయి. గరిష్ఠ ఉష్ణోగ్రతలు 44 డిగ్రీల మేర నమోదవుతున్నాయి. ఎండ తీవ్రతతో పాటు ఉక్కపోత వాతావరణం ఎక్కువగా ఉంటుందని, ఉత్తర తెలంగాణ జిల్లాల్లో వడగాల్పులు వీస్తున్నాయని వాతావరణ శాఖ అధికారి ధర్మరాజు తెలిపారు. రాత్రిపూట కనిష్ఠ ఉష్ణోగ్రతలు పెరగడం వల్ల అసౌకర్య పరిస్థితులు నెలకొంటున్నాయని తెలిపారు. ఉపరితల చక్రవాత అవర్తనం, ద్రోణి, క్యూములోనింబస్ మేఘాల ప్రభావంతో ఈ నెల 26 వరకు తెలంగాణ రాష్ట్రంలో ఉరుములు మెరుపులు, ఈదురుగాలులతో కూడిన తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు కురుస్తాయని చెప్పారు. ఈ వర్షాల వల్ల ఉష్ణోగ్రతల్లో అతి స్వల్పంగా మార్పు ఉంటుందని తెలిపారు. కుమురంభీం జిల్లాలో 44.5 డిగ్రీల ఉష్ణోగ్రత : శనివారం కుమురంభీం జిల్లా కెరమెరిలో అత్యధికంగా 44.6 డిగ్రీల ఉష్ణోగ్రత నమోదయ్యింది. నిజామాబాద్ జిల్లా మెండోరాలో 44.5 డిగ్రీలు, జగిత్యాల జిల్లా ఎండపల్లిలో 44.4 డిగ్రీల ఉష్ణోగ్రతలు నమోదైనట్లు హైదరాబాద్ వాతావరణ కేంద్రం ప్రకటించింది. రోజు రోజుకూ ఎండలు పెరుగుతున్న నేపథ్యంలో చిన్నారులు, వృద్ధులు తగిన జాగ్రత్తలు తీసుకోవాలని, అత్యవసరం అయితే తప్ప బయటకు వెళ్లొద్దని వాతావరణ శాఖ సూచనలు చేసింది.

## సంక్షేమ వారాన్ని సమర్థవంతంగా అమలు చేయాలి

- **రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి రామకృష్ణారావు**

**టీ మీడియా, ఏప్రిల్ 18, , హైదరాబాద్ బ్యూరో :**
ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక కార్యక్రమంలో భాగంగా ఈ నెల 20వ తేదీ నుండి 26వ తేదీ వరకు నిర్వహించనున్న 7 రోజుల సంక్షేమ వారాన్ని సమర్థవంతంగా నిర్వహించాలని రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి రామకృష్ణారావు సూచించారు. శనివారం హైదరాబాద్ నుండి ఉన్నతాధికారులతో కలిసి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా అన్ని జిల్లాల కలెక్టర్లు, అదనపు కలెక్టర్లు, సంక్షేమ శాఖల అధికారులతో సంక్షేమ వారం నిర్వహణపై సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 99 రోజుల ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక కార్యాచరణలో భాగంగా ప్రభుత్వ వసతి గృహాలు, గురుకుల పాఠశాలలు, ఆశ్రమ పాఠశాలలలో ఎస్సి, ఎస్టి, బిసి, మైనారిటీ విద్యార్థులకు సంబంధించి పారిశుద్ధ్య పనులు చేపట్టాలని తెలిపారు. విద్యార్థులకు క్విజ్, విద్యా విశ్లేషణ, చిత్రలేఖనం, పెయింటింగ్ పోటీలు నిర్వహించాలని సూచించారు. వసతి గృహాలలో అవసరమైన మరమ్మత్తు పనులు చేపట్టడంతో పాటు విద్యార్థుల తల్లిదండ్రులు, ఉపాధ్యాయులతో సమావేశాలు నిర్వహించి వసతులపై చర్చించాలని తెలిపారు. స్కిల్ డెవలప్మెంట్



కార్యక్రమాలు, వేసవి శిబిరాలు, బడిబాట కార్యక్రమాలను నిర్వహించాలని, రైతు రిజిస్ట్రీ 100 శాతం పూర్తి చేయాలని ఆదేశించారు. జిల్లా కలెక్టర్ అంకిత్ మాట్లాడుతూ ప్రభుత్వ ఆదేశాల మేరకు ఈ నెల 20వ తేదీ నుండి 26వ తేదీ వరకు జిల్లాలో సంక్షేమ వారాన్ని పకడ్బందీగా నిర్వహించేందుకు చర్యలు తీసుకుంటామని తెలిపారు. జిల్లాలోని ఎస్సి, ఎస్టి, బిసి, మైనారిటీ గురుకులాలు, వసతి గృహాలలో వంటగది, పారిశుద్ధ్యం, మరమ్మత్తు పనులు చేపడతామని, విద్యార్థులకు వివిధ విభాగాల్లో పోటీలు నిర్వహిస్తామని పేర్కొన్నారు. స్కిల్ డెవలప్మెంట్ కార్యక్రమాలు, తల్లిదండ్రులు-ఉపాధ్యాయుల సమావేశాలు నిర్వహించడంతో పాటు వేసవి శిబిరాలు, బడిబాట కార్యక్రమాలను సమన్వయంతో అమలు చేస్తామని తెలిపారు. రైతు రిజిస్ట్రీ 100 శాతం పూర్తి చేసేందుకు అవసరమైన చర్యలు తీసుకుంటామని చెప్పారు. అనంతరం జిల్లా అధికారులతో మాట్లాడుతూ జనగణన కార్యక్రమాన్ని సజావుగా నిర్వహించేందుకు జిల్లాలో తగిన ఏర్పాట్లు చేయవలసిందిగా సంబంధిత అధికారులకు ఆదేశాలు జారీ చేసినట్లు తెలిపారు. ఏప్రిల్ 26 నుండి మే 10 వరకు స్వయంగా ఆన్‌లైన్ నమోదు (సెల్ఫ్ ఎన్యూమరేషన్) చేసుకునే అవకాశాన్ని ప్రజలు వినియోగించుకోవాలని సూచించారు. అనంతరం మే 11 నుండి జూన్ 9 వరకు ఎన్యూమరేటర్లు ఇంటింటికి వెళ్లి వివరాలు సేకరిస్తారని తెలిపారు. ఈ కార్యక్రమం పూర్తిగా డిజిటల్ విధానంలో నిర్వహించబడనున్నందున అవసరమైన సాంకేతిక సదుపాయాలు కల్పించి, ప్రజల్లో విస్తృతంగా అవగాహన కల్పించాల్సిందిగా అధికారులను ఆదేశించారు.



## హార్మూజ్ జలసంధి దగ్గర టెన్షన్..టెన్షన్

### భారత నౌకలపై ఇరాన్ గన్‌బోట్ల దాడి

**టీ మీడియా, ఏప్రిల్ 18, , ఢిల్లీ బ్యూరో :**
హర్మూజ్ వివాదం మళ్లీ మొదటికి వచ్చింది. హర్మూజ్ జలసంధిని మూసేస్తున్నట్లు ఇరాన్ ప్రకటించింది. హర్మూజ్ దగ్గర అమెరికా దిగ్బంధం కొనసాగడంతో ఇరాన్ ఈ నిర్ణయం తీసుకుంది. నిన్న హర్మూజ్‌ను తెరుస్తునట్టు ఇరాన్ ప్రకటించింది. అయితే ఇరాన్ హర్మూజ్‌ను తెరిచినప్పటికి దిగ్బంధం కొనసాగుతుందని అమెరికా అధ్యక్షుడు ట్రంప్ ప్రకటించారు. దీంతో ఇరాన్.. మళ్లీ నిర్ణయాన్ని మార్చుకుంది.. ఇరాన్ నిర్ణయంతో హర్మూజ్ జలసంధి దగ్గర నౌకల రాకపోకలు నిలిచిపోయాయి. శత్రువుల నౌకలను ఎట్టి పరిస్థితుల్లో అనుమతించే ప్రసక్తే లేదని ఇరాన్ ప్రకటించింది. హర్మూజ్ పూర్తిగా తమ నియంత్రణలో ఉందని ఇరాన్ ప్రకటించింది. ఈ క్రమంలోనే.. హర్మూజ్ జలసంధి దగ్గర పలు నౌకలపై ఇరాన్ విరుచుకుపడుతుండటం ఆందోళన కలిగిస్తోంది.. తాజాగా.. హర్మూజ్ జలసంధి దగ్గర రెండు భారత నౌకలపై ఇరాన్ గన్ బోట్స్ దాడి చేసినట్లు తెలుస్తోంది. అయితే.. క్ర్యూ సిబ్బంది అంతా సురక్షితంగా ఉన్నారని ప్రభుత్వ వర్గాలు తెలిపాయి.

**ఇరాన్ రాయబారిని పిలిపించిన కేంద్రం..**
హోర్ముజ్ జలసంధిలో ఈరోజు భారత జెండా ఉన్న రెండు నౌకలపై ఇరాన్ గన్‌బోట్లు కాల్పులు జరిపాయని ప్రభుత్వ వర్గాలు తెలిపాయి. ఈ ఘటనలో ఎవరికీ గాయాలు కాలేదని, నౌకలకు ఎలాంటి నష్టం జరగలేదని వారు చెప్పారు. అయితే, చమురు వాణిజ్యానికి కీలకమైన ఈ నౌకా మార్గంలో, ఒమన్‌కు ఈశాన్యంగా జరిగిన ఈ ఘటన తర్వాత ఆ రెండు నౌకలు వెనుదిరగాల్సి వచ్చింది. ఈ ఘటనలో ప్రమేయమున్న రెండు నౌకలలో ఒకటి వెరీ లార్జ్ క్రూడ్ క్యారియర్ (ఞజజ). భారీ పరిమాణంలో ఉండి, సుదూర ముడి చమురు రవాణా కోసం రూపొందించబడిన ట్యాంకర్ ఉంది.. ఈ ఘటన అనంతరం న్యూఢిల్లీ ఇరాన్ రాయబారిని పిలిపించిందని వర్గాలు తెలిపాయి.
ఇదిలాఉంటే.. హర్మూజ్ జలసంధి దగ్గరి నుంచి 21 నౌకలను వెనక్కి పంపించినట్టు అమెరికా సైన్యం తెలిపింది. కాగా.. మరోవైపు సోమవారం అమెరికా-ఇరాన్ మధ్య రెండో దఫా చర్చలు జరిగే అవకాశాలున్నాయి. అమెరికాతో పూర్తి శాంతిని కోరుకుంటునట్టు ఇరాన్ ప్రకటించింది.

**యూకే బోట్లపై దాడి..**
అంతకుముందు.. హోర్ముజ్‌లో ట్యాంకర్‌పై రెండు ఇరానియన్ గన్‌బోట్లు కాల్పులు జరిపాయని.. సిబ్బంది సురక్షితంగా ఉన్నారు.. యూకే తెలిపింది. ఇరాన్ రివల్యూషనరీ గార్డ్స్ కార్ప్స్‌కు చెందిన రెండు గన్‌బోట్లు తమ ట్యాంకర్‌ను సమీపించాయని, ఎలాంటి రేడియో హెచ్చరిక లేకుండానే ఆ గన్‌బోట్లు "ట్యాంకర్‌పై కాల్పులు జరిపాయని" ట్యాంకర్ కెప్టెన్ నివేదించినట్లు యూకే మారిటైమ్ ట్రేడ్ ఆపరేషన్స్ సెంటర్ ఒక ప్రకటనలో తెలిపింది.

## ఫోన్ ఛార్జింగ్ పెట్టి నిద్రపోయిన దంపతులు

- **బ్యాటరీ పేలి భార్యాభర్తలు సజీవ దహనం**

**టీ మీడియా, ఏప్రిల్ 18, సురేంద్రనగర్:**
బిజీ లైఫ్‌లో చాలామంది రాత్రి నిద్రపోయే ముందు ఫోన్? ఛార్జింగ్? పెట్టి పడుకుంటున్నారు. ఉదయం లేచేసరికి 100 శాతం ఛార్జింగ్? అయ్యేలా చూసుకుంటున్నారు. అయితే, అలాంటి పనుల వల్ల ప్రమాదాలు తప్పవని నిపుణులు హెచ్చరిస్తూనే ఉన్నారు. తాజాగా జరిగిన అలాంటి ప్రమాదంలో ఇద్దరు దంపతులు సజీవ దహనమయ్యారు. ఫోన్? బ్యాటరీ పేలడంతో ఇంట్లో అగ్ని ప్రమాదం సంభవించి ఆ జంట అగ్నికి ఆహుతి అయ్యారు. గుజరాత్?లో జరిగిన ఈ ఘటన స్థానికంగా సంచలనంగా మారింది.

**అసలేం జరిగింది?**
పోలీసులు, స్థానికులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. సురేంద్రనగర్ జిల్లాలోని లింబ్డీ పట్టణంలో ఉన్న 'వోరా సొసైటీ'లో సాబిర్‌భాయ్ వోరా, ఆయన భార్య రషీదాబెన్ వోరా నివసిస్తున్నారు. రాత్రి నిద్రపోయే ముందు సాబిర్‌భాయ్ తన ఫోన్‌కు ఛార్జింగ్ పెట్టి నిద్రపోయారు. అర్ధరాత్రి సుమారు 2 గంటల సమయంలో ఊహించని ప్రమాదం సంభవించింది. ఛార్జింగ్ పెట్టిన ఫోన్ బ్యాటరీ వేడెక్కి ఒక్కసారిగా పేలిపోయింది. ఆ సమయంలో ఫోన్ పక్కనే ఉన్న సోఫా, ఇతర ఫర్నిచర్‌కు మంటలు అంటుకున్నాయి. ఇంట్లో అందరూ గాఢనిద్రలో ఉండటంతో, మంటలు వ్యాపిస్తున్న విషయాన్ని ఎవరూ వెంటనే గమనించలేకపోయారు. నిమిషాల వ్యవధిలోనే మంటలు ఇల్లంతా వ్యాపించాయి. దట్టమైన పొగ కమ్ముకోవడంతో గాలి ఆడక, మంటల నుంచి తప్పించుకోలేక సాబిర్‌భాయ్,



రషీదాబెన్ దంపతులు లోపలే చిక్కుకుపోయారు. ఇది గమనించిన వారి కుటుంబ సభ్యులు వెంటనే లింబ్డి అగ్నిమాపక సిబ్బందికి సమాచారం అందించారు. అయితే, అత్యవసర సమయాల్లో ప్రాణాలు కాపాడాల్సిన అగ్నిమాపక సిబ్బంది, తమ వద్ద సరైన పరికరాలు లేవని, ఇతర సాంకేతిక కారణాలు చూపుతూ సకాలంలో ఘటనా స్థలానికి చేరుకోలేదని మృతుల బంధువులు ఆరోపిస్తున్నారు. అనంతరం, సురేంద్రనగర్? మున్సిపల్? కార్పొరేషన్?లోని మరో అగ్నిమాపక సెల్?కు సమాచారం ఇచ్చారు. వాళ్లు వెంటనే ఘటనా స్థలానికి చేరుకుని మంటలను అదుపులోకి తీసుకువచ్చారని బంధువులు తెలిపారు. కానీ, దురదృష్టవశాత్తు అప్పటికే సబిర్?, రషీదాబెన్ అగ్ని ప్రమాదంలో సజీవ దహనం అయ్యారని వాపోయారు.

**రెండు గంటలైనా రాలేదు**
అయితే, ఘటన జరిగిన రెండు గంటల తర్వాత కూడా లింబ్డి అగ్నిమాపక బృందం ఘటనా స్థలానికి చేరుకోలేదని మృతుల బంధువులు ఆరోపించారు. వారి నిర్లక్ష్యం కారణంగా దంపతులు ప్రాణాలు కోల్పోయారని ఆవేదన వ్యక్తం చేశారు. లింబ్డి మున్సిపాలిటీలో అగ్నిమాపక వ్యవస్థను వెంటనే అప్డేట్ చేయాలని డిమాండ్ చేశారు. మరోవైపు, ఈ దుర్ఘటనపై పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారు. ఈ ఘటనకు అసలు కారణం తెలుసుకుంటామని పోలీసులు పేర్కొన్నారు. ఇందులో ఏదైనా నిర్లక్ష్యం ఉన్నట్లు తేలితే సంబంధిత వ్యక్తులపై చర్యలు తీసుకుంటామన్నారు. ఇద్దరి మృతదేహాలను పోస్టుమార్టం కోసం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించామని పోలీసులు తెలిపారు.

**నిపుణులు ఏమంటున్నారంటే!**
ఇదిలా ఉండగా, ఫోన్? ఛార్జింగ్‌లో ఉన్నప్పుడు మొబైల్‌ను దిండ్లు, దుప్పట్లపై పెట్టొద్దని నిపుణులు సూచిస్తున్నారు. దీని వల్ల వేడి బయటకు వెళ్లలేక బ్యాటరీ సెల్స్ పాడవుతాయని చెబుతున్నారు. రాత్రంతా ఫోన్ ఛార్జింగ్‌లో పెట్టడం వల్ల బ్యాటరీ సామర్థ్యం దెబ్బతినే అవకాశం కూడా ఉందంటున్నారు. నిజానికి, ఇప్పటి ఫోన్లు చాలా స్మార్ట్ అని, బ్యాటరీ 100 శాతం నిండగానే ఛార్జింగ్‌ను వాటంతట అవే ఆపేస్తాయని చెబుతున్నారు. కానీ, అసలు సమస్య 100 శాతం వద్ద ఎక్కువ సేపు ఉండటమేనని అంటున్నారు. ఫలితంగా లిథియం అయాన్ బ్యాటరీలపై ఓల్టేజ్ స్ట్రెస్ పెరిగి కాలక్రమేణా వాటి సామర్థ్యం తగ్గుతుందని చెబుతున్నారు. బ్యాటరీ లైఫ్ పెరగాలంటే 20 నుంచి 80 శాతం మధ్య ఛార్జింగ్ ఉండేలా చూసుకోవాలని నిపుణులు సూచిస్తున్నారు.

## అసెంబ్లీ బరిలో స్మగ్లర్ వీరప్పన్ భార్య, కూతురు

- **వేరు వేరు పార్టీల్లో పోటీ**

**టీ మీడియా, ఏప్రిల్ 18, చెన్నై:**
ఒకటి కాదు రెండు కాదు ఏకంగా 36 సంవత్సరాల పాటు పట్టు పడకుండా తప్పించుకుని తిరిగిన మోస్ట్ వాంటెడ్ స్మగ్లర్ వీరప్పన్ కుటుంబం మరోసారి వార్తల్లో నిలిచింది.. వీరప్పన్ భార్య పెద్ద కుమార్తె ఇద్దరు తమిళనాడు ఎన్నికల్లో రెండు అసెంబ్లీ నియోజకవర్గాల నుంచి బరిలోకి దిగుతున్నారు. అయితే తల్లీ కూతుర్లు వీరిద్దరూ వేరువేరు పార్టీల్లో పోటీ చేస్తుండటం.. ప్రస్తుతం తమిళనాడు రాజకీయాల్లో హాట్ టాపిక్ గా మారింది. ఇంతకీ మోస్ట్ వాంటెడ్ స్మగ్లర్ వీరప్పన్ భార్య.. పెద్ద కుమార్తె పోటీ చేస్తున్న నియోజకవర్గాలు ఎక్కడున్నాయి.. ఏయే పార్టీల నుంచి పోటీ చేస్తున్నారో తెలుసుకుందాం..మరోసారి వార్తల్లో స్మగ్లర్ వీరప్పన్ ఫ్యామిలీ.. అసెంబ్లీ బరిలో భార్య, కూతురు.. మామూలు ట్విస్ట్ కాదుగా.. తమిళనాడు అసెంబ్లీ ఎన్నికలకు సమయం దగ్గరపడుతోంది.. అన్ని పార్టీలు ప్రచారాలతో హోరెత్తిస్తున్నాయి.. మాటల తూటాలతో రాజకీయాలు వేడెక్కుతున్న సమయంలో గంధపు చెక్కల స్మగ్లర్ వీరప్పన్ భార్య ముత్తు లక్ష్మీ, పెద్ద కుమార్తె విద్యరాణి వేర్వేరు రాజకీయ పార్టీల తరఫున వేర్వేరు నియోజకవర్గాల నుంచి పోటీ చేయడం రాజకీయ వర్గాల్లో హాట్ టాపిక్‌గా మారింది. తమిళనాడులోని కృష్ణగిరి అసెంబ్లీ నియోజకవర్గం నుంచి పార్టీ నుంచి వీరప్పన్ భార్య ముత్తులక్ష్మి.. వెల్మురుగన్ నేతృత్వంలోని తమిళగ వజ్వురిమై కట్చి (ుఎఖ) తరపున ఆమె అభ్యర్థిగా బరిలోకి దిగారు. అలాగే వీరప్పన్ పెద్ద



కుమార్తె విద్యారాణి సేలం జిల్లాలోని మెట్టూరు అసెంబ్లీ నియోజకవర్గంలో పోటీ చేస్తున్నారు. సీమాన్ నేతృత్వంలోని నామ్ తమిళర్ కట్చి అభ్యర్థిగా ఆమెను ప్రకటించారు. వీరప్పన్ కుమార్తె విద్యారాణి ఒక లాయర్ గా విద్యావేత్తగా. ఆమె రాజకీయ ప్రస్థానం అనేక మలుపులు తిరిగింది. ప్రారంభంలో, ప్రధానంగా తన సామాజిక నేపథ్యం కారణంగా ఆమె పీఎంకేలో చేరారు. ఆ తర్వాత 2020లో బీజేపీలో చేరి, కృష్ణగిరి జిల్లాకు ఆ పార్టీ యువజన విభాగం రాష్ట్ర ఉపాధ్యక్షురాలిగా పని చేసారు. ఆ సమయంలో, ప్రధానమంత్రి మోదీ సంక్షేమ పథకాలను ప్రజలకు చేరవేయడమే తన లక్ష్యమని ఆమె పేర్కొన్నారు. ముఖ్యంగా కావేరీ సమస్య విషయంలో తమిళనాడు హక్కులను కాపాడటంలో కేంద్ర ప్రభుత్వం విఫలమైందని పేర్కొంటూ, ఆమె 2024లో సీమాన్ సమక్షంలో బీజేపీకి రాజీనామా చేసి నామ్ తమిళర్ కచ్చిలో చేరారు. 2024 లోక్‌సభ ఎన్నికల సమయంలో కృష్ణగిరి నియోజకవర్గంలో తొలిసారిగా పోటీ చేసిన విద్యారాణి, 1,06,260 ఓట్లు (9.15%) సాధించి అందరినీ ఆశ్చర్యపరిచారు. ఆ నియోజకవర్గంలో గతంలో ఎన్‌టికెకు ఉన్న 2 శాతం ఓట్ల వాటాతో పోలిస్తే ఇది భారీ పెరుగుదల. ప్రస్తుతం ఆమె సేలం జిల్లాలోని మెట్టూరు నియోజకవర్గంలో ఎన్‌టికె అభ్యర్థిగా పోటీ చేస్తున్నారు. ఈ నియోజకవర్గంలో వన్నియర్ సామాజిక వర్గం ఓట్లు గణనీయంగా ఉన్నందున, ఆమె అభ్యర్థిత్వం పిఎంకె-ఎఐఎడిఎంకె కూటమికి గట్టి సవాలుగా పరిగణిస్తున్నారు. తన ప్రచారంలో విద్యారాణి, తన తండ్రి వారసత్వాన్ని ప్రముఖంగా ప్రస్తావిస్తూనే, రైతుల సంక్షేమం, విద్యాభివృద్ధికి సంబంధించిన అంశాలపై కూడా దృష్టి సారిస్తున్నారు. 2025 మార్చిలో, ఎన్నికల సమయంలో ఆమె చేసిన అలుపెరుగని కృషికి గుర్తింపుగా, సీమాన్ విద్యారాణిని నామ్ తమిళర్ కచ్చి యువజన విభాగానికి రాష్ట్ర కోఆర్డినేటర్‌గా నియమించారు. ఆమె ప్రస్తుతం తమిళనాడు వ్యాప్తంగా పార్టీ యువ కార్యకర్తలను సమీకరించే పనిలో నిమగ్నమై ఉన్నారు. అయితే ఇదే ఎన్నికల్లో వీరప్పన్ భార్య, విద్యారాణి తల్లి ముత్తులక్ష్మి, తమిళగ వాళ్వురిమై కచ్చి తరపున కృష్ణగిరి నియోజకవర్గం నుండి అభ్యర్థిగా పోటీ చేస్తున్నారు. తల్లీకూతుళ్లు వేర్వేరు రాజకీయ పార్టీలకు చెందిన వారైనప్పటికీ, ఇద్దరూ వీరప్పన్‌ను "అడవుల సంరక్షకుడు -- తమిళ జాతి సంరక్షకుడు"గా చిత్రీకరిస్తూ ప్రచారం చేస్తున్నారు. ఈనెల 23 న జరగనున్న ఎన్నికల్లో వీరప్పన్ కుటుంబం నుంచి బరిలో దిగుతున్న ఇద్దరిలో గెలుపు జెండా ఎవరు ఎగరవేస్తారో అంటూ తమిళనాడు ప్రజలు ఆసక్తిగా ఎదురు చూస్తున్నారు.